సంపుటి : 18
సంచిక : 104
Vol : 18
Issue : 104

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, బుధవారం 17 జూన్ 2026
Karimnagar, Wednesday 17 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
♦ హనుమకొండ ♦ కరీంనగర్
♦ భూపాలపల్లి ♦ పెద్దపల్లి/రామగుండం
♦ జనగామ ♦ మహబూబాబాద్
♦ హైదరాబాద్ ♦ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

# అడవి ఆగం..



- పట్టణీకరణతో కనుమరుగవుతున్న పచ్చదనం
- తెలంగాణలో ఆందోళన కలిగిస్తున్న తాజా రిపోర్ట్
- ఒక శాతం అడవి కూడా లేని జిల్లాలు మూడు
- ములుగు, భద్రాద్రి జిల్లాల్లే రాష్ట్రానికి ఊపిరి
- హైదరాబాద్, కరీంనగర్‌లో దారుణ పరిస్థితులు

7వ పేజీలో..

# సామాన్యులకు ఊరట

## త్వరలో తగ్గనున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు?

- అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందంతో రిలీఫ్
- తగ్గనున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- అనేక రంగాలకు గుడ్‌న్యూస్....



**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** అంతర్జాతీయ రాజకీయ ముఖచిత్రంపై అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కుదరబోతున్న శాంతి ఒప్పందం, సుదూర దౌత్య పరిణామంగా అనిపించినప్పటికీ, దీని ప్రభావం నేరుగా సామాన్య భారతీయుడి జేబుపై పడనుంది. భారతదేశ ముడి చమురు దిగుమతులలో దాదాపు 60 శాతం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో హోర్ముజ్ జలసంధి గుండానే సాగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గి, రవాణా సాధారణ స్థితికి వస్తుందనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఇప్పటికే 4 శాతానికి పైగా పతనమయ్యాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన దిగుమతిదారులలో ఒకటైన భారతదేశానికి ఈ పరిణామం ఐదు రకాలుగా భారీ ఊరటను ఇవ్వనుంది. భారతదేశం దాదాపు 85 శాతానికి పైగా ముడి చమురును విదేశాల (మిగతా 2లో...)

# ప్రైవేట్ స్కూల్ బస్సులపై ఫోకస్

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు
- సరైన ధ్రువపత్రాల పరిశీలన
- విద్యార్థుల భద్రతే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్
- పలు వాహనాలు సీజ్..

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** హైదరాబాద్: విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైన తొలి రోజే తెలంగాణ రవాణా శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి స్కూల్, కాలేజీ బస్సుల భద్రతపై దృష్టి సారించింది. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తున్న 245 విద్యాసంస్థల వాహనాలను అధికారులు గుర్తించగా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న 60 స్కూల్ బస్సులను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల భద్రతే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పలు కీలక లోపాలు వెలుగుచూసినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు (మిగతా 7లో...)

# దగ్గుమందుపై కేంద్రం కీలక నిర్ణయం

## ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఆదేశాలు



**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** దేశంలో నకిలీ, ప్రమాదకరమైన మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చిన్న చిన్న గ్రామాల్లో కఫ్ సిరప్‌ల (దగ్గు మందు) అమ్మకాలపై ఇప్పటివరకు ఉన్న మినహాయింపులను పూర్తిగా రద్దు చేసింది. ఇకపై ఎంతటి చిన్న పల్లెటూరైనా సరే.. సరైన డ్రగ్ లైసెన్స్ లేని దుకాణాల్లో కఫ్ సిరప్‌లను విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

గ్రామీణ ప్రాంతాల్లో దగ్గు మందుల నియంత్రణ, నాణ్యతా ప్రమాణాలను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం డ్రగ్స్ రూల్స్, 1945 కింద కీలక సవరణలు చేపట్టింది. ఇందుకోసం కేంద్రం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ (మిగతా 7లో...)



# అనుమతులు నిల్? అడ్మిషన్లు ఫుల్!

- ఇంటర్నేషనల్, సీబీఎస్ఈ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులకు భారీ భారం
- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు ఎప్పుడు?
- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు!
- మూడు పువ్వులు... ఆరు కాయలుగా విద్యా వ్యాపారం

2వ పేజీలో..



# చారికి మోకాలడ్డు!

## మధుసూదనాచారికి చెక్ పెట్టడమే గండ్ర లక్ష్యమా?

ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి!

- భూపాలపల్లి బీఆర్ఎస్‌లో బయల్పడిన ఆధిపత్య పోరు
- మాజీ స్పీకర్ సిరికొండ పరపతి తగ్గిస్తున్న గండ్ర?
- హరీష్ రావు పర్యటన చెప్పింది అదేనా!!
- గతంలోనూ చారికి ఎదురైన అవమానాలు!
- ఇలా ఐతే 2028లో బిఆర్ఎస్‌కు కష్టమే..
- వీరిద్దరి వర్గపోరుతో కాంగ్రెస్‌కే లాభం!

2వ పేజీలో..



# శాయంపేట ఉపసర్పంచ్‌పై కేసు నమోదు

2లో

- 'పీపుల్స్‌డైరీ' యాజమాన్యంపై దుర్భాషలాడిన ఫలితం
- జీపీ పాలకవర్గ నిర్లక్ష్యంపై ఇటీవల ప్రచురించిన కథనాలు..
- సంయమనం కోల్పోయి పత్రికపై ఉపసర్పంచ్ అనుచిత వ్యాఖ్యలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన 'పీపుల్స్‌డైరీ' యాజమాన్యం

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 17 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 104


## శాయంపేట ఉపసర్పంచ్‌పై
# కేసు నమోదు

- ‘పీపుల్స్‌డైరీ’ యాజమాన్యంపై దుర్భాషలాడిన ఫలితం
- జీపీ పాలకవర్గ నిర్లక్ష్యంపై ఇటీవల ప్రచురించిన కథనాలు..
- సంయమనం కోల్పోయి పత్రికపై ఉపసర్పంచ్ అనుచిత వ్యాఖ్యలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ‘పీపుల్స్‌డైరీ’ యాజమాన్యం

**శాయంపేట, జూన్ 16 (పీపుల్స్‌డైరీ) :** ‘పీపుల్స్‌డైరీ’ దినపత్రిక యాజమాన్యంపై దుర్భాషలాడడంతో పాటు పత్రికపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శాయంపేట ఉపసర్పంచ్ దైనంపెల్లి సుమన్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పత్రిక యాజమాన్యం ఇచిచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ? జి. పరమేశ్వర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... గత కొద్ది రోజుల క్రితం శాయంపేట మండల కేంద్రంలో తాగునీటి వాటర్ ట్యాంక్‌లో కోతులు పడి మృతిచెందగా అదే నీటిని రోజుల తరబడి ప్రజలకు సరఫరా చేశారనే విషయాన్ని ‘పీపుల్స్‌డైరీ’ కథనం ప్రచురించింది. ఈ దారుణ విషయంపై వ్యక్తిగతంగా ఎవ్వరి పేరు ప్రస్తావించకుండా పాలకవర్గం, సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ వార్త ప్రచురితం కాగా, సంయమనం కోల్పోయిన ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ పత్రికా ఎడిటర్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడడమే కాక పత్రికపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. కోతులు మృతిచెందిన ఘటనలో సర్పంచ్‌గానీ, ఇతర పాలకవర్గం గానీ, మండల జిల్లా స్థాయి అధికారులు ఎవ్వరూ స్పందించకున్నా కేవలం ఉపసర్పంచ్ అత్యుత్సాహం ప్రదర్శించి నోటి దూల ప్రదర్శించాడు. సమాజంలో నాలుగో స్థంభంగా పిలువబడే మీడియాపై అతడికి ఎంతలా చిన్నచూపు ఉందో నిరూపించుకున్నాడు. జరిగిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించడమేకాక ఏకంగా పత్రికా ఎడిటర్‌కే ఫోన్‌చేసి దుర్భాషలాడడం సంచలనంగా మారింది. ప్రజల సమక్షంలో తప్పు ఒప్పులపై విచారించాల్సింది పోయి ఆవేశానికి లోనైన ఉపసర్పంచ్ ఇలా నోరుపారేసుకోవడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు నిజనిజాలను తెలియజేయడంలో పాలకవర్గం విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, పత్రిక యాజమాన్యం ఇచిచన ఫిర్యాదు మేరకు ఉపసర్పంచ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో చర్యలకు ఉపక్రమిస్తామని ఎస్ఐ? వివరించారు.







# చారికి మోకాలడ్డు..!?

- మధుసూదనాచారికి చెక్ పెట్టడమే గండ్ర లక్ష్యమా?
- ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి!
- భూపాలపల్లి బీఆర్ఎస్‌లో బయల్పడిన ఆధిపత్య పోరు
- మాజీ స్పీకర్ సిరికొండ పరపతి తగ్గిస్తున్న గండ్ర?
- హరీష్ రావు పర్యటన చెప్పింది అదేనా!!
- గతంలోనూ చారికి ఎదురైన అవమానాలు!
- ఇలా ఐతే 2028లో బిఆర్ఎస్‌కు కష్టమే అంటున్నా ప్రజలు..
- వీరిద్దరి వర్గపోరుతో కాంగ్రెస్‌కే లాభం!

భూపాలపల్లి, జూన్ 16 పీపుల్స్ డైరీ : ముందొచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ములే వాడి అనే సామెత వినే ఉంటారు. ప్రస్తుతం భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీకి ఈ సామెతను అన్వయించుకోవచ్చు. మొదటి నుంచి కేసీఆర్ వెన్నంటి ఉంటూ అనేక ఉద్యమాల్లో పాల్గొని బీఆర్ఎస్ పార్టీలో కీలకపాత్ర పోషించిన మధుసూదనాచారికి తన సొంత నియోజకవర్గమే పరాయిగా మారిపోయే పరిస్థితులు కల్పించబడుతున్నాయి. అడుగడుగునా అడ్డంకులు, అవమానాలతో మధుసూదనాచారి లోలోపల మదనపడుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా తన స్వార్థ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌లో చేరాడని ప్రజల విమర్శలు ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యే ‘గండ్ర’.. మధుసూదనాచారికి చెక్ పెట్టి తనదే ఆధిపత్యం కావాలన్న తహతహలో ఉన్నట్టు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

మధుసూదనాచారి వర్సెస్ గండ్ర రమణారెడ్డి...

భూపాలపల్లి నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. భూపాలపల్లి బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత పోరు హరీష్ రావు పర్యటన సాక్షిగా మళ్ళీ బయటకు వచ్చింది. గతంలో తెలంగాణ స్పీకర్ గా పనిచేసిన, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్న సిరికొండ మధుసూదనా చారికి స్థానికంగా ప్రాధాన్యత తగ్గడం, ఆయనకు ఆగ్రహాన్ని తెప్పించడమే కాకుండా, ఆయన అనుచరులలోను ఆగ్రహానికి కారణమైంది. హరీష్ రావు పర్యటన సాక్షిగా భూపాలపల్లిలో సిరికొండ మధుసూదనాచారికి ప్రాధాన్యత తగ్గుతున్నది అన్న అంశం తెర మీదకు వచ్చింది.


**ఇంతకీ హరీష్ రావు పర్యటనలో ఏం జరిగిందంటే..**

మాజీ మంత్రి హరీష్ రావు, భూపాలపల్లి జిల్లాలో సింగరేణి బావుల పరిశీలన పర్యటనలో ఒక్కసారిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వర్గీయులు హరీష్ రావు సమక్షంలో గండ్ర రమణారెడ్డి జిందాబాద్, గండ్ర నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కంగుతిన్న చారి వర్గం కూడా నినాదాలు చేయడంతో హరీష్ రావు సాక్షిగా వర్గ విబేధాలు బయటకు వచ్చాయని అనుకోవచ్చు..

**గత ఏడాది కేటీఆర్ పర్యటన లో కూడా....**

గతంలో కేటీఆర్ పర్యటనలో స్వాగతించటానికి వచ్చిన సిరికొండ మధుసూదనా చారిని, ఆయన అనుచరులను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ గణపురం మండలంలో పర్యటిస్తున్న క్రమంలో ఆయన హెలీ ప్యాడ్ వద్దకు వెళ్తున్న మాజీ స్పీకర్, తాజా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారికి చేదు అనుభవం ఎదురైనట్టు సమాచారం. కేటీఆర్‌కు స్వాగతం పలకడానికి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు వెళుతున్న క్రమంలో గణపురం ప్రధాన రోడ్డుపై ఆయన వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

ఆపై తాను మధుసూదనాచారి తాను ఎమ్మెల్సీ అని చెప్పడంతో ఆయన వాహనాన్ని పోలీసులు వదిలిపెట్టారు. అనంతరం ఆయనతో పాటు వచ్చిన పలువురు నాయకుల వాహనాలను సైతం పోలీసులు అడ్డుకోవడంతో మధుసూదనాచారి ఆగ్రహానికి గురయ్యారు. నన్ను నాతో పాటు వచ్చిన నాయకులను అడుగడుగునా అడ్డుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పోలీసులు వాహనాన్ని హెలిపాడ్ వద్దకు వెళ్లడానికి అనుమతించిన తర్వాత హెలిపాడ్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన మరో బందోబస్తు వద్ద కూడా ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో సిరికొండ మధుసూదనాచారి తీవ్ర అసహనానికి గురయ్యారు. గతంలో కల్వకుంట్ల కవిత పర్యటనలోనూ ఇలాగే జరిగిందని, కావాలనే స్థానికంగా ఆయన ప్రాధాన్యతను తగ్గించడానికి ఒక వర్గం ప్రయత్నం జరుగుతోందన్న చర్చ జోరుగా జరుగుతుంది.



**తాజాగా హరీష్ రావు పర్యటన సాక్షిగా వర్గ పోరు**

గత ఎన్నికల్లో మధుసూదనా చారి ఓటమి పాలు కావటంతో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీఆర్ఎస్ లోకి వచ్చిన ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం సిరికొండ మధుసూదనా చారి పేరు ఎక్కడా లేకుండా చేస్తున్నారని మధుసూదనా చారి వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇక మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన లో ఆద్యంతం బీఆర్ఎస్ పార్టీలో వర్గ పోరు కనిపించింది. సిరికొండ మధుసూదనా చారి, గండ్ర వర్గీయులు నినాదాలతో హోరెత్తించారు.

**పంచాయితీ ఎటు దారితీసేనో?**

మొత్తానికి ఒకప్పుడు భూపాలపల్లి నియోజకవర్గంలో ఏకచిత్రాధిపత్యంగా ఉన్న సిరికొండ మధుసూదనా చారి ఆధిపత్యాన్ని గండ్ర తగ్గించే ప్రయత్నంలో భాగంగా ఇదంతా జరుగుతుందని స్థానికంగా చర్చ జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంటే మళ్లీ స్థానికంగా బీఆర్ఎస్ నేతల మధ్య పొసగని తీరు బీఆర్ఎస్‌కు నష్టం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మరి ఈ పంచాయితీ ఏ రూపం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇలా ఐతే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ వర్గ పోరు నడిస్తే కాంగ్రెస్ పార్టీకే బలం చేకూరుతుందని ప్రజలు గుసగుసలడుతున్నారు.

# సామాన్యులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

నుంచే దిగుమతి చేసుకుంటుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా హోర్ముజ్ జలసంధి మూతపడి ఇప్పటివరకు దిగుమతిదారులు చెల్లిస్తూ వచ్చిన భారీ రిస్క్ ప్రీమియం భారం ఇకపై తగ్గనుంది. అలాగే ఇరాన్‌పై ఆంక్షలు సడలిస్తే మార్కెట్లోకి అదనపు చమురు సరఫరా రానుంది. దీనివల్ల దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడమే కాకుండా, రానున్న రోజుల్లో ధరల పెంపుదలకు బ్రేక్ పడే అవకాశం ఉంది.

**దిగిరానున్న విమాన ప్రయాణ ఛార్జీలు**

ఎయిర్‌లైన్స్ కంపెనీల నిర్వహణ ఖర్చులలో ఎక్కువ శాతం విమాన ఇంధనానికే ఖర్చు అవుతుంది. ఈ శాంతి చర్చల కారణంగా చమురు ధరల తగ్గుదలతో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు కూడా తగ్గనున్నాయి. తద్వారా విమానయాన సంస్థలు ఛార్జీలను తగ్గించడానికి లేదా ఎక్కువ డిస్కౌంట్లు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. భారతదేశంలో దేశీయ విమాన ప్రయాణాలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న తరుణంలో, అలాగే గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లే అంతర్జాతీయ రూట్లలో ప్రయాణించే వారికి ఈ నిర్ణయం వల్ల విమాన టికెట్ల ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది.

**వంటగదిపై తగ్గనున్న ద్రవ్యోల్బణం భారం**

నిజంగానే ఈ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసరాల ధరలు కూడా తగ్గే ఛాన్స్ ఉంటుంది. ఎదుకంటే వాటిని రవాణా చేసే ట్రక్కుల రవాణా వ్యయం తగ్గుతుంది. అంతేకాకుండా, గల్ఫ్ దేశాల నుండి దిగుమతి అయ్యే యూరియా సరఫరా మెరుగుపడటంతో వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గే ఛాన్స్ ఉంది. దీని వల్ల గత కొన్నాళ్లు స్థిరంగా ఉన్న నిత్యావసర వస్తువు తగ్గి నెల వారి ఇంటి ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంది.

**గ్యాస్ సిలిండర్ ధరల స్థిరీకరణ**

హోర్ముజ్ జలసంధి మళ్లీ ఓపెన్ అవ్వడం కేవలం ముడి చమురుతో పాటు ఎల్‌పీజీ (గ్యా+), సహజ వాయువు ధరలు కూడా తగ్గే ఛాన్స్ ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తల కారణంగా విపరీతంగా పెరిగిన షిప్పింగ్ ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు తగ్గడం వల్ల, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరలను స్థిరంగా ఉండే ఛాన్స్ ఉంది.

**తగ్గనున్న లోన్ ఈఎంఐలు**

ఆర్థిక విశ్లేషకుల ప్రకారం, సామాన్యుడికి లభించే అతిపెద్ద పరోక్ష ప్రయోజనం బ్యాంక్ లోన్ల రూపంలో ఉంటుంది. ఇంధన ధరలు తగ్గితే దేశంలో ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది. ద్రవ్యోల్బణం తగ్గితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను తగ్గించేందుకు మొగ్గు చూపుతుంది. దీనివల్ల సామాన్యుల హోమ్ లోన్లు, కార్ లోన్ల నెలవారీ ఈఎంఐలు తగ్గి, జేబుకు మరింత ఊరట లభిస్తుంది.

# అనుమతులు నిల్.. అడ్మిషన్లు ఫుల్..!

- ఇంటర్నేషనల్, సీబీఎస్ఈ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులకు భారీ భారం
- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు ఎప్పుడు?
- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు!
- మూడు పువ్వులు... ఆరు కాయలుగా విద్యా వ్యాపారం











**మేడ్చల్ జూన్ 15 (పీపుల్స్ డైరీ) :** జిల్లాలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ అనుమతులు, కనీస మౌలిక వసతులు లేకుండానే అడ్మిషన్లు చేపడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా “ఇంటర్నేషనల్” మరియు “సీబీఎస్ఈ” పేర్లతో ఆకర్షణీయమైన ప్రచారం నిర్వహిస్తూ అడ్మిషన్లు పొందుతున్న పాఠశాలలపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ వర్గాల సమాచారం ప్రకారం, కొన్ని పాఠశాలలకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటిపై తదుపరి చర్యలు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారులే నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తున్నప్పటికీ, కఠిన చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా జిల్లాలోని అనేక పాఠశాలలు సీబీఎస్ఈ అనుబంధం లేకపోయినా, “సీబీఎస్ఈ కరికులమ్”, “ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్” వంటి పదాలను ప్రచారంలో ఉపయోగిస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై విద్యాశాఖ అధికారులను ప్రశ్నిస్తే, “మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం” అనే సమాధానం మాత్రమే వినిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు, కొన్ని పాఠశాలలు కనీస ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు కూడా పాటించకుండా అద్దె భవనాల్లో, ఇరుకైన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఫీజుల వసూళ్లలో కఠినంగా వ్యవహరించే యాజమాన్యాలు, విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయుల అర్హతలు, అనుభవం విషయంలో మాత్రం సరైన ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. తగిన శిక్షణ, అర్హతలు లేని వ్యక్తులను ఉపాధ్యాయులుగా నియమించి విద్యా బోధన కొనసాగిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అదేవిధంగా నోట్‌బుక్స్, పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూస్ తదితర వస్తువులను పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత పాఠశాలల యాజమాన్యాల స్పందన తెలియాల్సి ఉంది. జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల పనితీరు, అనుమతులు, భద్రతా ప్రమాణాలు, ఉపాధ్యాయుల అర్హతలు, ఫీజుల నియంత్రణ వంటి అంశాలపై విద్యాశాఖ సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

**ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై చర్యలేవీ?**

ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు తమ పేర్లను మార్చుకుంటూ కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత అధికారుల నుంచి ఇప్పటికీ ఎలాంటి కఠిన చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పేరును సదాశివ పాఠశాలగా మార్చిన ఘటనపై విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. అయితే ఆందోళనల అనంతరం కొన్ని బ్యానర్లు తొలగించడం మినహా సంబంధిత యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పాఠశాలలకు అధికారుల మౌన సహకారం ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో కూడా అనేక ప్రైవేట్ పాఠశాలలు పాత పేర్లను మార్చి కొత్త పేర్లతో నిర్వహణ కొనసాగిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని పలువురు మండిపడుతున్నారు. పాఠశాలల పేర్ల మార్పుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

అంతేకాకుండా గత సంవత్సరం నాగార్జున, కృష్ణవేణి, విజ్ఞాన్, ఓక్లే ఇంటర్నేషనల్, మాస్టర్ మైండ్, బచ్‌పన్, పీవీ, సెయింట్ ప్యాట్రిక్ తదితర పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు జరుగుతున్నట్లు తనిఖీల్లో గుర్తించినప్పటికీ, సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది కూడా కొన్ని పాఠశాలల్లో యాజమాన్యాలే నేరుగా పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు నిర్వహిస్తున్నాయని చెబుతున్నారు.

“నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం వెనుక ఎవరి హస్తం ఉంది?” అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు నిర్వహించిన పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటి అనుమతులను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల ప్రయోజనాలు, తల్లిదండ్రుల ఆర్థిక భారం తగ్గింపు, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం అధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.








# మొక్కజొన్న వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు..!

### నూతనకల్‌లో సీడ్ కంపెనీ నిర్లక్ష్యం..?

**మేడ్చల్ జూన్ 16 (పీపుల్స్ డైరీ):-** ఎల్లంపేట మున్సిపల్ పరిధినూతనకల్ పరిధిలో గల అల్ట్రా సీడ్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డ్రైయింగ్ ప్లాంట్ వద్ద భారీగా పేరుకుపోయిన మొక్కజొన్న కండెలు మరియు వ్యవసాయ వ్యర్థాలు స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీ ఆవరణలో వేల టన్నుల మేర మొక్కజొన్న కండెలను బహిరంగంగా నిల్వ ఉంచడంతో పాటు, వాటి అవశేషాలు రహదారులపై వ్యాపించి దుమ్ము, మురికి సమస్యలకు కారణమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ వ్యర్థాలు తడిసి కుళ్లిపోతుండటంతో దుర్వాసన వెదజల్లే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రహదారులపై మొక్కజొన్న పొట్టు, దుమ్ము పేరుకుపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాల్సిన బాధ్యత కంపెనీపై ఉన్నప్పటికీ, బహిరంగంగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం కూడా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో ఇలాంటి పొడి వ్యర్థాలు ఒక్కసారిగా మంటలు చెలరేగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, పంచాయతీ మరియు పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలించి, కంపెనీ వ్యర్థాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. డ్రైయింగ్ ప్లాంట్ పరిసరాల్లో భారీగా పేరుకుపోయిన మొక్కజొన్న కండెల గుట్టలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. విత్తనాల ప్రాసెసింగ్ అనంతరం మిగిలే వ్యవసాయ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వేల టన్నుల వ్యర్థాల నిల్వ



పరిశ్రమ ఆవరణలో మొక్కజొన్న కండెలను భారీ గుట్టలుగా నిల్వ చేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ వ్యర్థాలు తడిసి కుళ్లిపోవడం, దుర్వాసన వెదజల్లడం, క్రిమికీటకాలకు ఆశ్రయంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. నిల్వ చేసిన వ్యర్థాల పరిమాణం రోజురోజుకు పెరుగుతుండటంతో భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది.

### రోడ్లపై వ్యాపిస్తున్న మొక్కజొన్న అవశేషాలు

ప్లాంట్ నుంచి బయటకు తరలించే ప్రక్రియలో మొక్కజొన్న కండెలు, పొట్టు, ఇతర అవశేషాలు రహదారులపై పడిపోతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో అవి మరింతగా చెల్లాచెదురవుతూ రహదారులు మురికిగా మారుతున్నాయి. వర్షం కురిసినప్పుడు ఈ అవశేషాలు బురదగా మారి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

### అగ్నిప్రమాద భయం

ఎండాకాలంలో పొడి మొక్కజొన్న కండెలు, వ్యవసాయ వ్యర్థాలు అగ్నిప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భారీ స్థాయిలో నిల్వ ఉంచిన ఈ వ్యర్థాల వద్ద తగిన భద్రతా చర్యలు ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే సమీప ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది.

### పర్యావరణ నిబంధనలు అమలవుతున్నాయా..?

పరిశ్రమల నుంచి వెలువడే ఘన వ్యర్థాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశాయి. అయితే నూతనకల్‌లోని ఈ సీడ్ కంపెనీ వద్ద వ్యర్థాల నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి

గ్రామ ప్రజలు, రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతీ, పరిశ్రమల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమల అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ప్రజలు గుర్తు చేస్తున్నారు. మొక్కజొన్న వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్నారా?. కాలుష్య నియంత్రణ మండలి అనుమతుల ప్రకారమే నిల్వ చేస్తున్నారా? వర్షాకాలంలో పర్యావరణ ప్రభావంపై అధ్యయనం చేశారా? రహదారులపై పడుతున్న వ్యర్థాల నివారణకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నూతనకల్ గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# బేటీ బచావో బేటీ పడావో, మహిళల చట్టాల పైన అవగాహన

### అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహణ..

**భూపాలపల్లి జూన్ 16 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఘనపూర్ మండలం, ధర్మరావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు మరియు జిల్లా సంక్షేమ అధికారి మల్లీ శ్వరి సూచనల మేరకు బేటీ బచావో బేటీ పడావో అవగాహన మరియు అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని సూపర్వైజర్ శ్రీమతి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పూజారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అనేది ప్రతి బిడ్డకు ప్రాథమిక హక్కు అని, బాలురు -- బాలికలు అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. బాలికల విద్య కుటుంబాభివృద్ధికి, సమాజ పురోగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇంచార్జి మిషన్ కోఆర్డినేటర్ క్రిష్ణ మాట్లాడుతూ.. మహిళల సాధికారత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి మరియు మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అలాగే మహిళలు మరియు బాలికల కోసం అందుబాటులో ఉన్న 181 మహిళా హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు మరియు 14567 సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగిం చుకోవాలని తెలిపారు.



జెండర్ స్పెషలిస్ట్ అనూష కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా బేటీ బచావో బేటీ పడావో, వంటి పథకం బాలికల విద్య, భద్రత మరియు ఆర్థిక భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. కుటుంబాల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురా వచ్చని పేర్కొన్నారు సూపర్వైజర్ శ్రీమతి లక్ష్మి అమ్మ మాట -- అంగన్వాడి బాట కార్యక్రమం ద్వారా మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది క్రిష్ణ, అనూష, సురేష్ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ఘనంగా పెంచక్ సిలాట్ రాష్ట్రస్థాయి పోటీలు

- **185 మంది క్రీడాకారుల ప్రతిభా ప్రదర్శన -- జాతీయ స్థాయికి పలువురు ఎంపిక**

**మేడ్చల్, జూన్ 16(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన పెంచక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘన విజయాన్ని సాధించాయి. ఈ నెల 14న జంగా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన 185 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు ప్రీ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీపడ్డారు. పోటీల్లో క్రీడాకారులు చూపిన నైపుణ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులు మహారాష్ట్రలోని నాసిక్‌లో జూన్ 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న



14వ జాతీయస్థాయి పెంచక్ సిలాట్ పోటీలకు ఎంపికైనట్లు పెంచక్ సిలాట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ దశరథం, ప్రధాన కార్యదర్శి డి.దుర్గా సతీష్ గౌడ్ వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎంఆర్ స్కూల్స్ గ్రూప్ చైర్మన్ చామకూర శ్రీశైలం రెడ్డి, చామకూర సౌజన్య రెడ్డి, ముత్యాల గాంధీ యాదవ్, సీహెచ్ దశరథం హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చామకూర శ్రీశైలం రెడ్డి, సౌజన్య రెడ్డి పెంచక్ సిలాట్ ప్రపంచంలోనే ప్రాచీన మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో ఒకటని, ఆత్మరక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. స్పోర్ట్స్ కోటా సౌకర్యం కారణంగా విద్యా, ఉద్యోగ రంగాల్లో యువ క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పోటీల్లో మంచిర్యాల జిల్లా క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకోగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ద్వితీయ స్థానాన్ని సాధించింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల ఉత్సాహభరిత పాల్గొనికతో పోటీలు విజయవంతంగా ముగిశాయి. పెంచక్ సిలాట్ వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలకు ప్రోత్సాహం కల్పించేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు మరింత దోహదపడతాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

# వల్భాపూర్ విద్యార్థుల సమస్య స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు

**ఎల్కతుర్తి, జూన్ 16 ( పీపుల్స్ డైరీ ) :** హనుమకొండ జిల్లాఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామ సమీపంలోని ఎస్,ఆర్,ఆర్ ఫార్మసీ కళాశాల వద్ద విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎన్‌హెచ్ అధికారులు సానుకూలంగా స్పందించారు.గ్రామ ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మంగళవారం జాతీయ రహదారి అధికారులను కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.కళాశాల ముందు ఉన్న డివైడర్ కారణంగా బస్సులు ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్లిపోతుండటంతో విద్యార్థులు కళాశాల వద్ద దిగలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.దీంతో డివైడర్ కటింగ్ చేయడంతో పాటు విద్యార్థుల కోసం బస్ షెల్టర్ ఏర్పాటు



చేయాలని కోరారు.అలాగే వల్భాపూర్ గ్రామానికి ఏర్పాటు చేయాల్సిన సైన్‌బోర్డును పొరపాటున కోతులనడుమ పేరుతో ఏర్పాటు చేసిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గ్రామం పేరుతో సరైన నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామానికి సంబంధించిన ఇతర రహదారి సమస్యలను కూడా అధికారులకు వివరించారు.ఈ అంశాలపై స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు డివైడర్ కటింగ్, నేమ్‌బోర్డు ఏర్పాటు, బస్ షెల్టర్ నిర్మాణం వంటి అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వల్భాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్, వార్డ్ సభ్యుడు అంబాల కిషోర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం 2005 ను కచ్చితంగా అమలు చేయాలి

### ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన కరీంనగర్ జిల్లా ఆర్టిఐ వర్కింగ్ ప్రెసిడెంట్ దాట్ల శ్రీనివాస్. కన్వీనర్ బండ నరేందర్. ఆధ్వర్యంలో.



**కరీంనగర్ జూన్ 16 పీపుల్స్ డైరీ :** ఈరోజు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి మేడం ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాట్ల శ్రీనివాస్ కన్వీనర్ బండ నరేందర్ ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి ఒక్క సామాన్య పౌరునికి కావలసిన సమాచారాన్ని పారదర్శకంగా అమలు చేయాలని మండల, డివిజన్, జిల్లా, కార్యాలయంలో పౌర సమాచార అధికారిని నియమించాలని సమాచార హక్కు చట్టం 2005 ను కచ్చితంగా అమలు చేయాలని పౌర సమాచార అధికారికి సంబంధించిన వివరాలు తెలియజేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది .దీనిపై కలెక్టర్ స్పందించి రెండు మూడు రోజుల్లో మీ ప్రతి వినతిని అమలు చేసే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ మరియు తిరగ మల్ల నాగార్జున మరియు జి మహేందర్ రెడ్డి, బి నాగరాజు , ఏం మహేందర్ రెడ్డి, కుమారస్వామి, చింత కుమారస్వామి, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత -ఐదుగురు వ్యక్తులు అరెస్ట్



**భూపాలపల్లి జూన్ 16 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్, ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న గడ్డిగానిపల్లి గ్రామానికి చెందిన సెగ్గం సాయి వర్ధన్, సెగ్గంపల్లి గ్రామానికి చెందిన దాసరి వంశీ, దుర్గం మహార్షిలను అదుపులోకి తీసుకుని విచారించగా.వారు ఇచ్చిన సమాచారంతో గంజాయి సరఫరా చేస్తున్న మరో ఇద్దరు వెక్తులను ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, రొయ్యూరు గ్రామానికి చెందిన జాడి మనోజ్, దుర్గం కిరణ్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుండి మొత్తం 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీసీఎస్ సీఐ రమేష్ మాట్లాడుతు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# భూవివాదం విషయం పై ఏటూరు నాగారం లో ఉద్రిక్తత



**ఏటూరునాగారం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ఏటూరునాగారం మండల పరిధిలోని భూవివాదానికి సంబంధించి ఏటూరునాగారం పోలీసులు ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేశారు. భూస్వామ్య హక్కులపై ఇరు వర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు భారతీయ నాగరిక సురక్షా సంహిత (దీచీూ) సెక్షన్ 163 మరియు 164 కింద చర్యలు చేపట్టినట్లు నోటీసులో వెల్లడించారు. గతంలో నమోదైన కేసులు, ప్రస్తుతం కొనసాగుతున్న వివాదాలను పరిగణనలోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా ఈ నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇరు వర్గాలు చట్టాన్ని గౌరవించి ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. నోటీసులు అందుకున్న వారు నిర్దేశించిన తేదీన సంబంధిత అధికారుల ఎదుట హాజరుకావాలని సూచించారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో భద్రత ప్రమాణాలు పాటించాలి

**పసుల వినయ్ కుమార్ ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు**



**భూపాలపల్లి జూన్ 16 పీపుల్స్ డైరీ :** పాఠశాల లు ప్రారంభం అయ్యాయి ప్రయ-వేట్ పాఠశాలల యాజమాన్యం పిల్లలను గ్రామాలనుండి వారి పాఠశాల కు తీసుకుపోయేందుకు బస్సు లను నడుపుతూ న్నాయి. ఆ బస్సులు పదిలంగా ఉన్నాయా, ఫిట్టుగా ఉన్నాయా, అనుభవం కలిగిన డ్రైవర్లు ఉన్నారా 2026 ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేసే ఆర్టీఏ అధికారులు ఎక్కడా అని పి ఎస్ ఎఫ్ ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుల వినయ్ కుమార్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేట్ స్కూల్ యజమాన్యాలు పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండల జిల్లా విద్యాశాఖ అధికారులు ఎక్కడని ఆయన ప్రశ్నించారు భద్రత ప్రమాణాలు లేకుండా స్కూల్ బస్సులు నడుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం తెలియజేశారు పరిమితికి మించి తీసుకెళ్తున్నారని దీని ద్వారా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని డ్రైవర్లు అనుభవం కలిగి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఫైర్ సేఫ్టీ ఉండాలని బస్సుల ఫిట్నెస్ తప్పనిసరిగా కలిగి ఉండాలని అలాంటి ప్రమాణాలు పాటించని ప్రవేట్ స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు వెంటనే సీజ్ చేయాలని భద్రత ప్రమాణాలు పాటించని స్కూల్ యాజమాన్యం పై కూడా చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎక్కడికక్కడ ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకుంటామని హెచ్చరించారు..

# వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు




**ఎల్కతుర్తి జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ఎల్కతుర్తి మండలానికి చెందిన ప్రముఖ పత్రికా విలేకరి వంశీ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సాతురి చంద్రమౌళి మాట్లాడుతూ, వంశీ జర్నలిజం రంగంలో నిబద్ధతతో పనిచేస్తూ అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతున్నారని కొనియాడారు. సహచర విలేకరులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, సమాజ సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంలో ఆయన చూపుతున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. వంశీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో నిండి ఉన్న దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ప్రతి వివాహ వార్షికోత్సవాన్ని ఇలాగే సంతోషోత్సాహాల మధ్య జరుపుకోవాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. వంశీ అందరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిగా, సహచరులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే మంచి మిత్రుడిగా పేరు పొందారని సభ్యులు పేర్కొన్నారు. ఆయనకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మరింత విజయాలు చేకూరాలని కోరుతూ ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్ తరఫున శుభాభినందనలు తెలిపారు.

# అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు



**హుజురాబాద్, జూన్ 16: (పీపుల్స్ డైరీ) :** అక్షరాభ్యాసం పిల్లల జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టమని, విద్యకు శ్రీకారం చుట్టే శుభకార్యంగా భావిం చబడుతుందని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు అన్నారు. హుజురాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి, వారి విద్యాభ్యాసం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అక్షరాభ్యాసం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదని, పిల్లల విద్యా జీవితానికి తొలి మెట్టుగా నిలుస్తుందని అన్నారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించడం ద్వారా పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ప్రశాంత్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు రాధిక, శోభారాణి, వార్డు కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐ పులి వెంకట్‌కు ఘనంగా సన్మానం




**శంకరపట్నం జూన్: 16 పీపుల్స్ డైరీ:** హుజురాబాద్ సీఐగా విధులు నిర్వహించి, ఇటీవల బదిలీపై జమ్మికుంటకు వెళ్లిన శ్రీ పులి వెంకట్ ను టీపీసీసీ సభ్యులు, శంకరపట్నం మాజీ జడ్పీటీసీ శ్రీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన హుజురాబాద్ ప్రాంత ప్రజలకు, పోలీస్ శాఖకు అందించిన సేవలను కొనియాడుతూ, నూతన బాధ్యతల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి తిరుపతి మాజీ మండల అధ్యక్షులు గోపాగోని బస్వయ్య గౌడ్, ఉపసర్పంచ్ల ఫోరమ్ మండల అధ్యక్షులు గొట్టే మధు, మత్యగిరింద్ర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ ఉప్పుగల్ల మల్లరెడ్డి సీనియర్ నాయకులు జనగాం రాజయ్యగౌడ్, లక్ష్మణరావు షారుఖ్ రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమకు తగ్గ వేతనం అందలేదని ఉపాధి కూలీలు నిరసన

- క్షేత్రస్థాయిలో కొలతలు తీసుకోక కూలీలకు తక్కువ వేతనాలు
- పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది తో కూలీల ఆవేదన
- టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంతో కూలీలకు తక్కువ వేతనాలు ఆరోపణ



**సైదాపూర్, జూన్16 ( పీపుల్స్ డైరీ):** సైదాపూర్ మండలం పెరిక పల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతుల పొలంలో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించే పనిచేస్తున్న కూలీల కొలతలు చేయకుండానే క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ కొలతలు తీసుకోక ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దాదాపు నాలుగు వారాల నుండి కూలీలకు చేసిన పనికి డబ్బులు రావడం లేదని పని ఎక్కువ చేసిన సిబ్బంది కూలీల యొక్క కొలతలు తక్కువ చేసినట్ట రికార్డులో రాయడం ద్వారా తక్కువ వేతనం వస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా మండల అధికారులు చొరవ తీసుకొని ఉపాధి హామీ కూలీలకు సరైన వేతనం అందే విధంగా చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయిలో కొలతలు చేపట్టి ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కూలీలు అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు తిప్పని దేవేందర్ శిరంశెట్టి సుధాకర్ శ్రీనివాస్ పోతరాజు వేణు శ్రీనివాస్ బోళ్ల తిరుమల్ పోతరాజు శ్రీనివాస్ దేవేందర్ సురేష్ తిరుమల్ సుధాకర్ మండల ఐలయ్య లక్కర్సు రాజయ్య చింతం వెంకటేశ్వర్లు శిరం శెట్టి వెంకటేశ్వర్లు ను నుగోప్పుల కొమురయ్య వంగ రాజయ్య వెంకటయ్య పిల్లి సధయ్య అరుకాల మల్లయ్య సంపత్ మహిళలు పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేశారు

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- పట్టణంలోని శ్రీ సాయి ఏసీ ఫంక్షన్ హాల్ ఉదయం 10 గంటలకు
- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సోమారపు రాజయ్య

**సైదాపూర్ జూన్ 16 ( పీపుల్స్ డైరీ ) :** ఈ నెల 17న హుస్నాబాద్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం రోజున మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ విస్తరణకు కీలకమని పేర్కొంటూ.. ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాల నమోదు చేపట్టాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కొత్త సభ్యులను చేర్చుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాజీ మంత్రులు హరీష్ రావు, జీవన్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు హాజరవుతారన్నారు. ఆయన తెలిపారు



# ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మిమ్స్‌లో స్ఫూర్తిదాయక కార్యక్రమం

### రక్తదానం మరో ఒక్కరికి ప్రాణదానం




**మేడ్చల్ జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడగలదనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పుతూ మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించింది. వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది, వైద్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 14న నిర్వహించే ప్రపంచ రక్తదాన దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. రక్తం అవసరమైన వేలాది మంది రోగులకు జీవనాధారం అందించే దాతలకు కృతజ్ఞతలు తెలిపే రోజు. ఇదే భావనతో మిమ్స్ యాజమాన్యం మూడు రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో రక్తదానంపై చైతన్యం కల్పించింది. సాధారణంగా రక్తదానం చేస్తే బలహీనత వస్తుందని, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని కొందరిలో ఉన్న అపోహలను వైద్య నిపుణులు శాస్త్రీయంగా వివరించి తొలగించారు. రక్తదానం పూర్తిగా సురక్షితమైన ప్రక్రియ అని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ నిర్భయంగా రక్తదానం చేయవచ్చని అవగాహన కల్పించారు. దీంతో ప్రేరణ పొందిన వందలాది మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకుని శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రక్తదానానికి ముందు ప్రతి దాతకు బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్, హెచ్‌ఐవీ, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి, సిఫిలిస్, మలేరియా వంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించడం విశేషం. ఈ పరీక్షల ద్వారా ఆరోగ్యవంతులైన దాతల నుంచి మాత్రమే రక్తాన్ని సేకరించి, ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందే రోగులకు ఉపయోగపడేలా భద్రపరిచారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డా. మాన్విత సింధు మాట్లాడుతూ, రక్తదానం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, పైగా కొత్త రక్తకణాల ఉత్పత్తికి దోహదపడుతుందని వివరించారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, క్యాన్సర్ చికిత్సలు వంటి అనేక సందర్భాల్లో రక్తం అత్యవసరంగా అవసరమవుతుందని, అందుకే ప్రతి వ్యక్తి రక్తదానం చేయడాన్ని జీవితంలో ఒక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రక్త అవసరం పెరుగుతున్న నేపథ్యంలో యువత ముందుకొచ్చి స్వచ్ఛంద రక్తదాతలుగా మారడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మిమ్స్ నిర్వహించిన ఈ కార్యక్రమం కేవలం రక్తదాన శిబిరంగా కాకుండా, యువతలో సేవా భావాన్ని పెంపొందించే సామాజిక ఉద్యమంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేసి అభినందించిన నిర్వాహకులు, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఒకరి రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదనే సందేశాన్ని మరోసారి గుర్తు చేస్తూ మిమ్స్ నిర్వహించిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలిచింది.

# విశాఖ ఉక్కు ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి




**సింగరేణి (కారేపల్లి) జూన్ 16 (పీపుల్స్ డైరీ):** విశాఖ ఉక్కు ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని టి. యు. సి. ఐ డిమాండ్. ప్రైవేటీకరణ విధానాల ఫలితమే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదమని టి యు సి ఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య అన్నారు, ఈరోజు (మంగళవారం) కారేపల్లిలో విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల సమావేశంలో టి యు సి ఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సిబ్బందిని తగ్గించే పని భారం పెంచడం వల్లే ఈ ప్రమాదాలకు కారణమని వారు ఆరోపించారు, తరచూ కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం మని వారు విమర్శించారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పర్యవేక్షణ లేకపోవడమే తరచూ ఈ ప్రమాదాలకి కారణమని వారు ఆరోపించారు, గత సంవత్సరం కాలంగా 12 మంది కార్మికుల చనిపోయినట్లు వార్తలొస్తున్న ప్రమాదాలపై ఉన్న స్థాయి కమిటీలు పర్యవేక్షణ లేకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వారన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రైవేటీకరణ విధానాల కారణంగానే విశాఖ ఉక్కులో ప్రమాదం జరిగిందని, ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, క్షతగాతులకు 50 లక్షలు పరిహారం చెల్లించాలని బాధిత కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని, వారి డిమాండ్ చేశారు. భద్రత ప్రమాణాలు గాలికి వదిలేలా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడులను తక్షణమే రద్దుచేసి ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కావున కూటమి ప్రభుత్వం తక్షణమే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని వారు సందర్భంగా డిమాండ్ చేశారు. మాదారం స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ కారేపల్లి కామేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రు, వీరు, శివ, రవి, నాగేశ్వరరావు, లక్ష్మణ్, సుమన్, రవీందర్, బిక్కు, చందు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ శిక్షణ కార్యక్రమం



**సింగరేణి (కారేపల్లి) జూన్ 16 (పీపుల్స్ డైరీ):** సింగరేణి మండలం లో వైఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్, లోకల్ బాడీ స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ రావడం జరిగింది. ఈ యొక్క శిక్షణ కార్యక్రమంలో బిఎల్వోలు, బిఎల్ఎలు, సింగరేణి మండల సర్పంచులు ఈ యొక్క శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి శ్రీజ ఇప్పటివరకి ఓటరు జాబితాలో ఎంతమందిని మ్యాపింగ్ చేశారు, మ్యాపింగ్ చేయని వారిని ఏబిసిడి వర్గాలుగా విభజించి వారి యొక్క డాక్యుమెంట్స్ 25వ తారీకు లోపు కలెక్ట్ చేసి 25వ తారీకు నుంచి మూడుసార్లు ప్రతి ఒక్కో ఓటరు ఇంటికి వెళ్లి సర్వే చేసి ఇన్యుమరేటర్ ఫామ్ ఫిల్ అప్ చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో గాదపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ చనిపోయిన వారి ఓట్లని ఏ విధంగా తొలగిస్తారు..? వారి యొక్క డెత్ సర్టిఫికెట్స్ అందుబాటులో లేనప్పుడు వారిని ఏ విధంగా డిలీట్ చేస్తారు. అదేవిధంగా బతుకుతెరువు కోసం వేరే ప్రాంతాలకు వెళ్లి అక్కడ కూడా ఓట్లు తీసుకున్నవారికి అక్కడ ఇవ్వాలా లేక ఇక్కడ డాక్యుమెంట్స్ ఇవ్వాలా అనే విషయంపై చర్చించడం జరిగింది. చనిపోయిన వారి వివరాలు సెక్రటరీ వారి యొక్క కుటుంబ సభ్యుల స్టేట్మెంట్ తీసుకుని వారిని డిలీట్ చేయవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఓటరు ఇంటికి వెళ్ళినప్పుడు వారికి రెండు చోట్ల ఓట్లు కలిగి ఉంటే ఏ ప్రాంతంలో ఉండాలో ఆ ప్రాంతంలోనే మీరు సర్టిఫికెట్స్ సమర్పించవలసి ఉంటుందని చెప్పడం జరిగింది. కొంతమంది బి ఎల్ ఓ లు, సర్పంచులు వారికున్న సందేహాలని జాయింట్ కలెక్టర్ ను అడిగి క్లారిఫై చేసుకోవడం జరిగింది. ఈ యొక్క శిక్షణ కార్యక్రమం జాయింట్ కలెక్టర్ శ్రీజ ఆధ్వర్యంలో జరగడం ద్వారా కొన్ని విషయాలు తెలుసుకోవడం జరిగిందని శిక్షణకు హాజరైనటువంటి సర్పంచులు బిఎల్వోలు, బిఎల్ఎలు చెప్పడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో సింగరేణి మండల ఎమ్మార్వో, ఎంపీ ఓ, ఇన్చార్జి ఎంపీడీవో, సింగరేణి మండల వివిధ సర్పంచులు కారేపల్లి సర్పంచ్ టోనీ, వివిధ పంచాయతీ సెక్రటరీలు, ఆర్ ఐ వన్, ఆర్ ఐ టూ లు, డి టి, యూ డి సి, ఎమ్మార్వో ఆఫీస్ స్టాఫ్ అందరు పాల్గొనడం జరిగింది

# సెయింట్ క్లారైట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఘన సత్కారం

- ఉత్తమ ఫలితాలతో మెరిసిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత




**మేడ్చల్ జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని బాసర గడ్డి గల సెయింట్ క్లారైట్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో విజయవంతంగా ఉత్తీర్ణులవడంతో పాఠశాల యాజమాన్యం ప్రత్యేక సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారి సుధాకర్, మాజీ కౌన్సిలర్ అంతోనామ ఫిలిప్స్, స్వాతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు కోమలత, మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ మరిలమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన అక్షరను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. అలాగే వివిధ సబ్జెక్టుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన సబ్జెక్ట్ టాపర్లకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థుల కృషి, పట్టుదల, క్రమశిక్షణ విజయానికి కారణమని అతిథులు కొనియాడారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని పేర్కొంది. ఇలాంటి సత్కార కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మరింత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయడానికి ప్రేరణనిస్తాయని తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమనికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

# అనుమతి లేకుండా తాడి చెట్ల నరికివేతపై గీతకార్మికుల ఆవేదన



**హుజూరాబాద్, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ మండల పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామ శివారులో అనుమతి లేకుండా తాడి చెట్లను నరికివేయడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన గీతకార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని గౌడ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గౌడ సంఘం గ్రామాధ్యక్షుడు చింత కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన ముద్దమల్ల సాగర్ తన వ్యవసాయ భూమిలో ఉన్న ఎనిమిది తాడి చెట్లను ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నరికివేశాడని ఆరోపించారు. తాడి చెట్లు గీతకార్మికుల జీవనాధారమని, వాటిని అక్రమంగా తొలగించడం వల్ల వారి ఉపాధికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి తాడి చెట్లను నరికివేసిన ముద్దమల్ల సాగర్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం ఉపాధ్యక్షుడు చింత సమ్మయ్యతో పాటు సభ్యులు పైడిపల్లి సమ్మయ్య, చింతరాజు, నెరెళ్ల కార్తీక్, బండి అమ్మయ్య తదితరులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయంపై రైతు ముద్దమల్ల సాగర్ తన వివరణను ఇచ్చినప్పటికీ, ముందస్తు అనుమతి లేకుండా తాడి చెట్లను నరికివేయడాన్ని గీతకార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నారు. దీంతో గ్రామంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై సంబంధిత శాఖ అధికారులు విచారణ జరిపి ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశం ప్రస్తుతం చర్చనీయా ంశంగా మారింది. స్థానికులు, గీతకార్మికులు అధికారుల జోక్యాన్ని కోరుతున్నారు.

# చారిత్రక ఆలయం పై అంతులేని నిర్లక్ష్యం..?

- అద్భుతమైన ఆలయం అభివృద్ధికి దూరం
- నాపాక ఆలయం పై పట్టింపేది..?
- ఆలయ అభివృద్ధిపై అధికారుల శీతకన్ను
- నాలుగు దిక్కులా నలుగురు దేవుళ్ళు ప్రత్యేకత



**చిట్యాల, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** చారిత్రక ఆలయం పై అధికారుల అంతులేని నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పాలకులు అధికారులు పురావస్తు శాఖ అధికారుల సమన్వయ లోపంతో చారిత్రక నేపథ్యం గల శిల్పకళా సంపద మరుగున పడిపోతుంది. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్ పాక గ్రామంలో గల నాపాక ఆలయ చరిత్ర కనుమరుగు అవ్వడమేనా శతాబ్దాల చరిత్ర ఆనవాళ్లు నిర్లక్ష్యం అనే పట్టింపు లేని తనంతో ఇటు అధికారులు అటు పాలకులు దృష్టి సారించక శతాబ్దాల చరిత్ర కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి ఈ ఆలయానికి దాపురించింది. అపురూపమైన ఆలయ చరిత్ర కనుమరుగు అవుతుందా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాచీన చరిత్ర సంపద కలిగిన నైన్ పాక నేలపై గల నాపాక ఆలయ చరిత్ర గురించి ప్రభుత్వం అధికారులు పురావస్తు శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ఘనమైన చరిత్ర గల నాపాక ఆలయ అభివృద్ధికి గ్రహణం పట్టింది. ఈ గ్రహణం ఎప్పుడు వీడుతుంది. ఈ ఆలయ అభివృద్ధి పూర్తిస్థాయిలో ఎప్పుడు జరుగుతుంది అని భక్తులు ప్రజలు కొన్ని ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. 15వ లేదా 16వ శతాబ్దంలో ఈ ఆలయం ఒకే రాతిపై నిర్మించబడింది. గర్భగుడి లోపల యోగా నరసింహస్వామి వేణుగోపాలస్వామి శ్రీరాముడు బలరాముడు తూర్పు దక్షిణం ఉత్తరం మరియు పడమర వైపుల వరుసగా ఒక్కొక్కటిగా రాయిపై ఒక భాగం అయిన బండరాయిపై చెక్కబడి ఉన్నాయి. 50 అడుగుల గోపురం యొక్క విమానం (పై భాగం) ఇటుకలతో తయారు చేయబడింది. గర్భగుడి మొత్తం ఒకే పెద్ద బండరాయితో చెక్కబడింది. ఈ ఆలయ అభివృద్ధి గురించి భక్తుల ఆశలు అడియాశలుగానే మిగులుతున్నాయి తప్ప అభివృద్ధి మాత్రం జరగడం లేదు. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్ పాక గ్రామంలో గల శ్రీ సర్వతో భద్ర నాపాక అలయ అభివృద్ధి ముందుకు సాగడం లేదు. అప్పటి భూపాలపల్లి శాసనసభ్యుడు మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదన చారి ఈ ఆలయాన్ని వెలుగులోకి తెచ్చి నిధులు మంజూరు చేసి కొంత అభివృద్ధి చేశారు. కానీ ఆ తర్వాత వచ్చిన ప్రజా ప్రతినిధులు మాత్రం ఆలయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆహ్వానం మేరకు వస్తారు ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం అని హామీ ఇస్తారు హామీ ఇవ్వడంతోనే సరిపోతుంది తప్ప అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. ఈ ఆలయానికి వచ్చిన భక్తులు ఇలాంటి ఆలయం దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేదు అని ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని చెపుతున్నా పాలకులు మాత్రం పట్టించుకునే స్థితిలో లేరు. ఈ ఆలయం వెలుగులోకి వచ్చిన నుంచి ప్రతి రోజు గ్రామంలోని పండితుడు పెండ్యాల ప్రభాకర చారి దీప ధూప నైవేద్యం పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు పూజలు జరిపిస్తారు ఇక్కడ ఆలయం కి చుట్టూ ప్రహరీ గోడ మరియు కల్యాణ మండపం తప్ప వేరే అభివృద్ధి కనిపించడం లేదు.

ఈ ఆలయంలో జరిగే ముక్కోటి ఏకాదశి కి జాతరకు కూడా నిధులు మంజూరు చేయరు ఆలయం చైర్మన్ గ్రామస్థులు దాతల సహకారంతో జాతర ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు చుట్టూ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు కానీ ఈ ఆలయంలో మాత్రం భక్తులకు అభివృద్ధి కనిపించడం లేదు. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది ఈ ఆలయానికి నాలుగు వైపులా ఒకే రాత్రికి నాలుగు ద్వారాలకు నాలుగు విగ్రహాలను చెక్కి దక్షిణ భారతదేశంలో ఎక్కడ లేని విధంగా ఒకే రాతిపై ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని ఎండోమెంట్ వారు ఇతర దేశస్తులు ఇతర నగరాల నుంచి ఎంతోమంది భక్తులు ఆలయానికి వచ్చి ఇలాంటి ఆలయం మరెక్కడా కూడా చూడలేదని లేదని ఈ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేయాలని అంటున్నారు కానీ ప్రభుత్వం ప్రజాప్రతినిధులు మాత్రం ఈ ఆలయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ఏర్పడిన తర్వాత అప్పటి భూపాలపల్లి శాసనసభ్యుడు తెలంగాణ మొట్టమొదటి స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి ఈ ఆలయాన్ని చూసి ఇలాంటి ఆలయం మరి ఎక్కడ కూడా లేదని ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వము నుండి నిధులు మంజూరు చేసి ఆలయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. కానీ ఆ తర్వాత భూపాలపల్లి శాసనసభ ఎన్నికల్లో ఓటమిపాలు అయిన తర్వాత ఈ ఆలయాన్ని ఎవరు కూడా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. భూపాలపల్లి నుంచి శాసనసభ్యులుగా ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు ఎవరు కూడా ఈ ఆలయాన్ని పట్టించుకోవడంలేదని భక్తులు విమర్శిస్తున్నారు. ఆలయ అభివృద్ధి గురించి పట్టించుకోవాలంటున్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లి ఈ ఆలయానికి ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరు చేసి ఆలయాన్నిఅభివృద్ధి చేసి ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

ఈ ఆలయం చుట్టూ పచ్చని పాడిపంటలు ఈ ఆలయానికి వెనకాల పెద్ద చెరువు ఆలయానికి కుడివైపులా కళ్యాణం మండపం అలాగే దేవుని పాదాలు నల్లటి రాతిబండపై భక్తులను ఆకర్షించే విధంగా కొలువుతీరి ఉన్నాయి. ఆలయానికి ఎడమవైపులా కొలను ఉంది ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చే విధంగా రూపుదిద్దు కుంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులు దేవాదాయ శాఖ మంత్రి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ని ఈ ఆలయానికి తీసుకువచ్చి నిధులు మంజూరు చేయించి ఈ ఆలయాన్ని తెలంగాణ రాష్ట్రంలో పర్యటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజలు భక్తులు కోరుతున్నారు.

# శంకరపట్నం మండలం నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా తిప్పబత్తిని నారాయణ



**శంకరపట్నం జూన్ :16 పీపుల్స్ డైరీ:** శంకరపట్నం మండలంలో మంగళవారం రోజున నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండలం నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయీ సమక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా తిప్పబత్తిని నారాయణ నాయీ 30 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక మహేష్ నాయీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి స్వసమాజ బంధువులు (సంగీయులు) పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్ నాయీ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఔదుర్తి లక్ష్మణ్ కుమార్ నాయీ, జిల్లా ఉపాధ్యక్షులు జంపాల భిక్షపతి నాయీ ముఖ్య అతిథులుగా హాజరై, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ. శంకరపట్నం మండల నాయీబ్రాహ్మణులంతా కలిసికట్టుగా ఉండి ఈ ఎన్నికల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన కమిటీ సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, సమాజ ఎదుగుదలకు తోడ్పడాలని ఆయన అన్నారు.

# ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు



**భూపాలపల్లి జూన్ 16 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్, ఆధ్వర్యంలో గణపురం మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా షాపులలోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు, నకిలీ విత్తనాలు, విడి విత్తనాల విక్రయాలు చేయరాదని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని షాపు యజమానులకు సూచించారు. వ్యవసాయదారులను మోసగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యవసాయదారులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలపై సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# అణగారిన వర్గాలకు అండగా వి.హనుమంతరావు

## ఘనంగా హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు



**మేడ్చల్ జూన్ 16(పీపుల్స్ డైరీ):-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమం, అభివృద్ధి సలహాదారు వి.హనుమంతరావు జన్మదిన వేడుకల సందర్భంగా కీసర మండల సామాజిక సేవా కార్యకర్త, కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు తుడుం శ్రీనివాస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుడుం శ్రీనివాస్ మాట్లాడుతూ, వి.హనుమంతరావు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, బీసీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని పేర్కొన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన అలుపెరగని పోరాటం చేస్తూ ప్రజాసేవలో ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ, ప్రజల మధ్యే ఉంటూ సేవలందిస్తున్న వి.హనుమంతరావు మరింత కాలం ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండి ప్రజాసేవను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం - మేడ్చల్ రూరల్ ఏఈ



**మేడ్చల్, జూన్ 16(పీపుల్స్ డైరీ) :** చెట్ల కొట్టివేత మరియు ఫీడర్ల నిర్వహణ పనుల నేపథ్యంలో మేడ్చల్ రూరల్ విద్యుత్ శాఖ పరిధిలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ/ఓపీ మేడ్చల్ రూరల్ తెలిపారు. బండమాధారం సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ రైలాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుంది. దీంతో రైలాపూర్, గిర్మాపూర్ గ్రామాలతో పాటు ఇండస్ట్రియల్ ఫీడర్, రాక్ సాండ్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలు ప్రభావితమవుతాయని. అదేవిధంగా 11 కేవీ శ్రీరంగవరం ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈ సమయంలో బండమాధారం, శ్రీరంగవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్వహణ పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

# మైసంపెల్లి గ్రామంలో అమ్మ మాట- అంగన్వాడీ బడి బాట కార్యక్రమం




**కోహెడ జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** సిద్దిపేట కోహెడ మండలం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మైసంపల్లి గ్రామం అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట - అంగన్వాడీ బడి బాట కార్యక్రమం సర్పంచ్ పకిడే సంపత్ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికిముఖ్యఅతిగాసామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు హాజరై మాట్లాడుతూ అంగన్వాడీ స్కూల్లో మూడేళ్ళు నిండిన చిన్నారులు నమోదును పెంచడానికి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే అమ్మ మాట- అంగన్వాడీ బాట అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మూడేళ్ళు నిండిన అర్హులైన పిల్లలను అంగన్వాడీ లలోచేర్పించడాని కి తల్లులకు అవగాహనా కల్పిస్తున్నట్లు చెప్పారు. తల్లులతో పిల్లలను అంగన్వాడీ కీ పంపించాలని, అంగన్వాడీ కేంద్రంలో అందించే సేవలను సద్వినియోగం రాజు పేర్కొన్నారు. అంగన్వాడీ పిల్లలకు యూనిఫామ్ లను జూన్ మాసంలో పంపిణీ చేయనున్నారు. ఈకార్యక్రమం లో మైసంపల్లి గ్రామ కార్యదర్శి బి.బాబు రావు, అంగన్వాడీ టీచర్స్ సంగెం చంద్రకళ, జెట్టి శ్యామల, ఆశాస్వరూప, మాజీ వార్డు సభ్యులు కత్తెర శ్రీనివాస్, సుదగోని యాదగిరి గౌడ్, హెల్పర్ లక్ష్మి, పద్మ, విద్యార్థులుఅక్షర, ఆధ్వత, సంధ్య, ఆదిత్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఇష్టంతోనే ఫోటో దిగాము-అవమానం కాదు

## ఆర్డీఓ విచారణలో సర్పంచులు వెల్లడి



**సైదాపూర్ జూన్ 16 ( పీపుల్స్ డైరీ) :** సైదాపూర్ తహా సిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, జాల కుమారి హుజురాబాద్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2026 మాసంలో గౌరవ సర్పంచ్ లకు నిర్వహించబడిన శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్ లను అవమానించినారని చేసిన ఫిర్యాదు విషయమై ఈరోజు విచారణ నిర్వహించారు. ఇట్టి విచారణలో సైదాపూర్ మరియు వీణవంక మండలాలకు చెందిన గౌరవ సర్పంచ్ హాజరై మేము మా ఇష్టపూర్వకంగానే గుర్తింపుగా ఫోటో దిగినామని ఎవరు మమ్ముల అవమానించలేదని గురు శిష్యుల గుర్తింపుగా ఫోటో దిగనైనదని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజేందర్ రెడ్డి చంద్రయ్య రవీందర్ విజయ రాజశేఖర్ రజినీకాంత్ శ్రీకాంత్ స్వరూప రజిత స్వప్న సునీత బబిత రమేష్ చిరంజీవి శంకర్ నాయక్ వేణుగోపాల్ రామ్ రెడ్డి తిరుపతిరెడ్డి ఎమ్మార్వో గుర్రం శ్రీనివాస్ గౌడ్ ఎంపీడీవో యాదగిరి నాయక్ ఎంపీఓ బషిరుద్దీన్ సురేందర్ పి ఆర్ ఏ ఈ మజీద్ హుస్సేన్ సర్పంచులు పాల్గొన్నారు

**ఆర్డీవోకు సన్మానం :** బదిలీపై హుజురాబాద్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రెవిన్యూ డివిజనల్ అధికారి జాల కుమారి సైదాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి మొదటిసారిగా రావడంతో సర్పంచులు శాలువతో ఘనంగా సత్కరించినారు.

# ప్రజలను అప్రమత్తం చేసేందుకే కార్డెన్ సెర్చ్



**రేగొండ జూన్ 16 పీపుల్స్ డైరీ** :సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలు అప్రమత్తం చేసేందుకు గ్రామాలల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు రేగొండ ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమల గిరి గ్రామంలో భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల రేగొండ ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు గ్రామంలో ఆపరేషన్ కార్డెన్ సర్చ్ తనిఖీలను నిర్వహించారు. గ్రామంలో అనుమానంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ క్రైం, గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తుల విషయంలో అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఐక్యమత్యంగా ఉంటూ శాంతియుతంగా మెలగాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ నెల 20 వ తేది వరకు భూపాలపల్లి లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. లోక్ అదాలత్ ఉన్నందున చిన్న చిన్న కేసులు కొట్టుకున్న తిట్టుకున్నా యాక్సిడెంట్ కేసులు భూ తగాదాల కేసులు ఉన్న ఇరు వర్గాల వారు కోర్టుకు వచ్చి పరిస్కారం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్, గోరికొత్తపల్లి ఎస్సై త్రిలోక్ నాథ్,పోలీసులు, గ్రామస్థులున్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



**మేడ్చల్, జూన్ 16(పీపుల్స్ డైరీ):** జూన్ 21న నిర్వహించనున్న నీట్ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలోని 3,311 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, హాల్ టికెట్‌లో పేర్కొన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు మెడికల్ కిట్లు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు వీల్‌చైర్లు తదితర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, శ్యాంప్రకాష్తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాతూరి సుధాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా..



**మేడ్చల్, జూన్ 16(పీపుల్స్ డైరీ):** తెలంగాణ బీజేపీ రాష్ట్ర నాయకులు, మేడ్చల్ జిల్లా సాధన సమితి రథసారథి, వివేకానంద యూత్ సీనియర్ సభ్యులు, మేడ్చల్ జిల్లా సాధనలో కీలక పాత్ర పోషించిన నాయకుడు పాతూరి సుధాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు సాకరబోయిన వెంకటేష్, మామిళ్ల నర్సింగ్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, బీజేవైఎం కార్యదర్శి కానుకంటి భరత్ వంజరి తదితరులు సుధాకర్ రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాతూరి సుధాకర్ రెడ్డి సేవలను కొనియాడుతూ, పార్టీ బలోపేతం మరియు మేడ్చల్ జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.

# పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

- **కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి ,జిల్లా కలెక్టర్ అంకిత్**



**ఆళ్ళపల్లి జూన్ 16(పీపుల్స్ డైరీ) :**మండల లోప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.,మంగళవారం ఆళ్ళపల్లి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం వివరాలను ప్రధానోపా ధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ విభాగం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు అందిస్తున్న బోధన విధానం, విద్యా కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించేందుకు సిద్ధంగా ఉంచిన భోజనం, పాలు, బాలామృతం తదితర పోషకా హార పదార్థాలను పరిశీలించారు. కేంద్రంలో కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటాన్ని గమనించిన కలెక్టర్, హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకు న్నారు. గొత్తికోయలు నివసించే ఈ మారుమూల గిరిజన ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థు లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికా రులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పిల్లల సంఖ్య, వారికి అందిస్తున్న సేవలు, పోషకాహార సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో తక్కువ మంది పిల్లలు ఉన్నప్పటికీ అధిక మొత్తంలో నిల్వలు ఉండటాన్ని గమనించి, అవసరానికి మించి ఉన్న సరుకులను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే కేంద్రాల్లో పిల్లల చేరికలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశీలన సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, అంగన్‌వాడీ కేంద్ర భవనానికి పెయింటింగ్ వేయించి పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా, పోషకాహార సేవలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి నుండి పెద్ద వెంకటాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కుంగిపోయి ఉండటాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గమనించారు. వెంటనే వాహనం దిగి కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కల గకుండా అత్యవ సరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశిం చారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దారు ఉషారాణి, ఎంఈఓ శాంతారావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహార పథకం కోసం కేంద్రీకృత వంటగది నిర్మాణానికి స్థలాల పరిశీలన

- **ఆలియాబాద్, కేశవరం బీసీ హాస్టళ్లను తనిఖీ చేసిన కలెక్టర్ మను చౌదరి**



**మేడ్చల్, జూన్ 16(పీపుల్స్ డైరీ):-** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విస్తరించేందుకు కేంద్రీకృత వంటగది నిర్మాణానికి అన-ువైన స్థలాల ఎంపిక ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండలాల్లోని ఆలియాబాద్, కేశవరం గ్రామాలలో మూసివేసి ఉన్న బీసీ ప్రీ-మెట్రిక్ హాస్టళ్లను పరిశీలించారు. జిల్లాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకానికి 22 పాఠశాలలు ఎంపికైన నేపథ్యంలో, భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అల్పాహారం అందించే లక్ష్యంతో కేంద్రీకృత వంటగది ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. హాస్టళ్లు ఎప్పటి నుంచి మూసివేసి ఉన్నాయో, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం ఎంత ఉందో బీసీ సంక్షేమ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా స్థలాల పూర్తి వివరాలతో నివేదికను అందజేయాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు, కొత్త అడ్మిషన్ల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాలలో అందుతున్న భోజనం, క్రీడా సదు-పాయాలపై ఆరా తీశారు. ఫుట్‌బాల్, క్రికెట్ కిట్లు కావాలని విద్యార్థులు కోరగా, వాటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యటన అనంతరం అల్పాహార నిర్వహణ కాంట్రాక్టు సంస్థ మన్న ట్రస్ట్ ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్, కార్యక్రమం అమలు తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఝాన్సీరాణి, శామీర్‌పేట్ తహసీల్దార్ శ్రీనివాస్, మూడుచింతలపల్లి తహసీల్దార్ మహమ్మద్ ఇద్రీస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలి-డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీరాం

## చెల్పూర్ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



**హుజూరాబాద్, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ శ్రీరాం సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీరాం, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభుదాస్‌తో కలిసి చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్ విభాగాలను పరిశీలించిన ఆయన, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులకు సరైన అవగాహన కల్పించి నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందులను వినియోగించేలా చూడాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామస్థాయి-ంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. డయేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఈ రోజు నుంచి పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి ప్రజలకు తగిన సూచనలు అందించాలని ఆదేశిం చారు. ఈ తనిఖీలో చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ రాజేష్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సులో వృద్ధుల హక్కులపై అవగాహన



**ఇల్లంతకుంట, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం (World Elder Abuse Awareness Day - WEAAD) సందర్భంగా ఇల్లంతకుంట గ్రామంలోని వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్యానెల్ అడ్వకేట్లు రవికంటి మధుబాబు, ఆడెపు లింగమూర్తి వృద్ధుల హక్కులు, సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణలపై అవగాహన కల్పించారు. ఆశ్రమ నిర్వాహకులు పెద్ది ఆదిరెడ్డి, ఆశ్రమ అధ్యక్షులు అలిమెల్ల రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. న్యాయవాదులు మాట్లాడుతూ, వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణ ప్రతి కుటుంబ సభ్యుడి బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధులు ఎదుర్కొనే ఆర్థిక, మానసిక, శారీరక వేధింపులను అరికట్టేందుకు చట్టాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రతి సంవత్సరం జూన్ 15న ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిం చడం ద్వారా వృద్ధుల సమస్యలపై సమాజంలో చైతన్యం తీసుకురావడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మండల పారా లీగల్ వాలంటీర్లు కె. సరిత, ఎం. తిరుపతి, ఎస్. వెంకటేశ్వర్లు, ఎం. మనోహర్ పాల్గొని వృద్ధులకు న్యాయ అవగాహన కల్పించారు. అనంతరం న్యాయవాదుల చేతుల మీదుగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులు తమ పిల్లలు లేదా ఇతరుల నుంచి ఎలాంటి వేధింపులు, సమస్యలు ఎదుర్కొన్నా సంబంధిత న్యాయ సేవా సంస్థలను, పారా లీగల్ వాలంటీర్లను సంప్రదించి తమ హక్కులను పరిరక్షించుకోవాలని న్యాయవాదులు సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమంలోని వృద్ధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే సహించం



**హుజూరాబాద్, జూన్ 16 (పీపుల్స్ డైరీ):** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి టేకుల శ్రావణ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. అలాగే పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయించడం, అడ్మిషన్ ఫీజుల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడడం వంటి చర్యలను ఖండించారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని విద్యాసంస్థలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యా రంగంలో పారదర్శకత తీసుకురావడానికి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఫీజుల నియంత్రణకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసే వరకు పాఠశాలల యాజమాన్యాలు వేచి ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు ఎవరూ ఒత్తిడికి గురికాకుండా, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్న ఫీజులు లేదా పాఠ్యపుస్తకాల ఖర్చుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులు, తల్లిదండ్రులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడితే జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులను సంఘటితం చేసి ఉద్యమాలు చేపడతామని టేకుల శ్రావణ్ స్పష్టం చేశారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 17 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 104


# అడవి ఆగం...

- పట్టణీకరణతో కనుమరుగవుతున్న పచ్చదనం
- తెలంగాణలో ఆందోళన కలిగిస్తున్న తాజా రిపోర్ట్
- ఒక శాతం అడవి కూడా లేని జిల్లాలు మూడు
- ములుగు, భద్రాద్రి జిల్లాలే రాష్ట్రానికి ఊపిరి
- హైదరాబాద్, కరీంనగర్‌లో దారుణ పరిస్థితులు

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** మనిషి అభివృద్ధి, పట్టణీకరణ అనే అంధకారంలో పడి ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన పచ్చదనాన్ని నిలువునా నరికేస్తున్నాడు. రహదారుల విస్తరణ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, పారిశ్రామికీకరణ పేరిట ఏటా లక్షలాది చెట్లను గొడ్డలికి బలి ఇస్తుండటంతో పర్యావరణ సమతుల్యత దారుణంగా దెబ్బతింటోంది. కాంక్రీట్ వనాల్లా మారుతున్న నగరాల్లో పచ్చదనం కోసం వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషాదకర వాస్తవాన్ని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన తాజా నివేదిక స్పష్టంగా కళ్లముందుంచింది. తెలంగాణలోని జిల్లాల మధ్య అటవీ విస్తీర్ణంలో కనిపిస్తున్న భారీ అసమానతలు భవిష్యత్తు పర్యావరణ ముప్పునకు అద్దం పడుతున్నాయి.

రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,12,122 చదరపు కిలోమీటర్లు కాగా.. అందులో 27,688 చ.కి.మీ అంటే 24.05 శాతం అటవీ ప్రాంతం విస్తరించి ఉందని నివేదిక పేర్కొంది. అయితే ఈ పచ్చదనం అంతా కొన్ని జిల్లాలకే పరిమితమైంది. ఏకంగా 71.82 శాతం భూభాగం అడవులతో నిండిన ములుగు, 60.95 శాతం ఉన్న భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలు ప్రస్తుతం తెలంగాణకు ఊపిరితిత్తులుగా మారాయి. వైశాల్య పరంగా చూస్తే కొత్తగూడెం అత్యధికంగా 4,311.38 చ.కి.మీ. అటవీ ప్రాంతాన్ని కలిగి ఉంది. ములుగు, కొత్తగూడెంతో పాటు కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అడవులు ఎక్కువగా ఉన్నాయి. దీనికి కారణం ఇవి గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో విస్తరించి ఉండటమేనని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, గద్వాల జిల్లాల్లో అటవీ విస్తీర్ణం 1 శాతం కంటే తక్కువకుపడిపోయింది.

మరోవైపు పట్టణీకరణ కోరల్లో చిక్కుకున్న జిల్లాల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. రాజధాని హైదరాబాద్ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 0.80 శాతం మాత్రమే అటవీ ప్రాంతం మిగిలి ఉంది. ఇక కరీంనగర్ పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. అక్కడ అటవీ విస్తీర్ణం కేవలం 0.15 శాతానికి పడిపోయింది. అంటే ప్రతి వెయ్యి ఎకరాల భూభాగంలో కేవలం ఒకటిన్నర ఎకరం మాత్రమే అడవి ఉందన్నమాట. జోగులాంబ గద్వాల జిల్లాలోనూ ఒక శాతం కంటే తక్కువ పచ్చదనం ఉంది.

నానాటికీ అడవులు నశించిపోతుండటం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడం, ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోవడం వంటి వాతావరణ మార్పులను మనం చూస్తున్నాం. చెట్లను విచక్షణారహితంగా నరికేయడం వల్ల వన్యప్రాణులు నివాసాలు కోల్పోయి ఊళ్లపై పడుతున్నాయి. ఈ పర్యావరణ అసమతుల్యతను అరికట్టడానికి మైదాన, పట్టణ ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సామాజిక అడవుల పెంపకాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

# దగ్గుమందుపై కేంద్రం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. పాత నిబంధనల ప్రకారం.. 1,000 కంటే తక్కువ జనాభా ఉన్న చిన్న చిన్న గ్రామాల్లో రిటైల్ లైసెన్స్ లేకపోయినా కొన్ని షరతులతో దగ్గు సిరప్‌లను అమ్మడానికి వీలుండేది. కానీ, తాజా సవరణతో ఆ మినహాయింపులకు కేంద్రం పూర్తిగా చెక్ పెట్టింది.

కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త మార్పుల ప్రకారం.. చిన్న గ్రామాల్లోనైనా సరే కఫ్ సిరప్‌ల అమ్మకం, పంపిణీ ఇకపై కేవలం అధికారికంగా లైసెన్స్ పొందిన ఫార్మసీల (మెడికల్ షాపుల) ద్వారా మాత్రమే జరగాలి. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940 నిబంధనలను ఇందుకు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. నకిలీ మందుల సరఫరాను అడ్డుకోవడంతో పాటు, కఫ్ సిరప్‌ల విక్రయాల్లో పూర్తి పారదర్శకతను తీసుకురావడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.

దగ్గు మందుల బాధ్యతాయుతమైన విక్రయాలను ప్రోత్సహించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని ఆరోగ్య శాఖ తెలిపింది. ఒకవేళ ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినా లేదా విక్రయాల రికార్డుల్లో పారదర్శకత లోపించినా సంబంధిత డ్రగ్ లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఉన్న కఫ్ సిరప్ తయారీదారులు, హోల్‌సేల్ పంపిణీదారులు, రిటైల్ వ్యాపారులు ఈ కొత్త లీగల్ ఫ్రేమ్‌వర్క్‌కు లోబడి పనిచేయాలని స్పష్టం చేసింది.

చిన్న పల్లెల్లో సైతం నాణ్యమైన వైద్య ప్రమాణాలు అందించేందుకు, నకిలీ మందుల ముప్పు నుండి ప్రజలను కాపాడేందుకు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులపై ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్నాయా, వారికి తగిన డ్రైవింగ్ అనుభవం ఉందా అనే అంశాలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థుల భద్రతకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అటెండెంట్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

అంతేకాకుండా బస్సుల బ్రేకులు, టైర్లు, లైట్లు వంటి యాంత్రిక భాగాల పనితీరును కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, మరికొన్నింటిలో అవసరమైన పత్రాలు లేకపోవడం గుర్తించినట్లు సమాచారం. విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో ఎలాంటి రాజీ ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు.

రవాణా శాఖ గణాంకాల ప్రకారం తెలంగాణలో మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులు ఉండగా, వాటిలో 23,204 బస్సులకు మాత్రమే చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. మిగిలిన 2,783 బస్సులు తక్షణమే ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాలని అధికారులు ఆదేశించారు. తమ పిల్లలను స్కూల్ బస్సుల్లో పంపే ముందు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఓవర్‌లోడింగ్ లేదా నిబంధనలు పాటించని వాహనాల గురించి అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ హెచ్చరించింది.

# వాహన్ పోర్టల్‌లో నమోదుకండి...

**తెలంగాణలో ట్రాఫిక్ చలాన్లపై అప్‌డేట్..!**

**ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చు..**

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** రాష్ట్రంలోని వాహనదారులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ చలాన్ ల సమాచారం ప్రతి వాహన యజమానికి సకాలంలో చేరేందుకు రాష్ట్ర రవాణా శాఖ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ ట్రాఫిక్ చలాన్ ల సమాచారం నేరుగా మీ మొబైల్ కు రావాలంటే.. వాహనదారులు తప్పకుండా తమ వ్యక్తిగత వివరాలను అప్ డేట్ చేసుకోవాలని సూచించారు.

“మీ వాహన ట్రాఫిక్ ఉల్లంఘన ఈ-చలానాలతో పాటు ఇతర కీలక సమాచారాన్ని ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా నేరుగా, సకాలంలో తెలుసుకోవడానికి.. వెంటనే వాహన్ పోర్టల్ లో మీ మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీలను అప్ డేట్ చేసుకోండి.

కాంటాక్ట్ వివరాలను అప్ డేట్ చేసుకోవడం ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే కాకుండా, నోటిఫికేషన్లు అందకపోవడం వల్ల పడే జరిమానాల భారం నుంచి తప్పుకోవచ్చు. వాహనదారులు తమ వివరాలను http://vahan.parivahan.gov.in పోర్టల్ ద్వారా లేదా ఇక్కడ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సులభంగా, వేగంగా అప్ డేట్ చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ‘వాహన్’ పోర్టల్ లో నమోదైన మొబైల్ నంబర్ లేదా ఈ-మెయిల్ ఐడీకి పంపిన చలానాలను వాహన యజమానికి అధికారికంగా చేరినట్లుగానే పరిగణిస్తారు. కాబట్టి అలసత్వం వహించకుండా నేడే మీ వివరాలను అప్ డేట్ చేసుకోండి. సమాచారం తెలుసుకుంటూ జరిమానాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండండి” అని సీపీ సజ్జనార్ తన పోస్టులో ప్రస్తావించారు.

అలాగే హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న హింస, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు, పోలీసింగ్ లో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సరికొత్త సంస్కరణలు చేపడుతున్నట్లు సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ను పోలీస్ మెంటార్ గా నియమించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలు తమ సమస్యలను భయం లేకుండా.. మరింత స్వేచ్ఛగా వెల్లడించేందుకు స్పందన - ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు.



# ఉప్పల్ స్కైవాక్‌కు ‘ఫ్లైఓవర్’ గండం..

- తొలగింపు తప్పదా..?
- పిల్లర్ల నిర్మాణం కోసం ఒకవైపు తాత్కాలికంగా తొలగింపు
- 75 అడుగుల ఎత్తులో భారీ పిల్లర్ల నిర్మాణం

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఉప్పల్ స్కైవాక్‌కు ఎలివేటెడ్ కారిడార్ రూపంలో గండం పొంచి ఉంది. ఇక్కడ నిర్మిస్తున్న కొత్త కారిడార్ పిల్లర్ల కోసం స్కైవాక్‌ను వరంగల్ జాతీయ రహదారి వైపు సుమారు 17 మీటర్ల మేర తాత్కాలికంగా తొలగించనున్నారు. మెట్రో రైలు లైన్‌ను దాటేలా ఈ ఫ్లైఓవర్‌ను గరిష్ఠంగా 75 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. ఈ తొలగింపు, పునర్నిర్మాణ పనుల అంచనా వ్యయం కోసం నేడు ఒక కన్సల్టెన్సీ సంస్థ అధ్యయనం చేయనుంది. ఈ ఖర్చును మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భరించే అవకాశం ఉంది.

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేపట్టే క్రమంలో కొన్ని పాత నిర్మాణాలకు మార్పులు చేర్పులు చేయడం అనివార్యమవుతోంది. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ జంక్షన్‌లో పాదచారుల భద్రత కోసం నిర్మించిన ప్రతిష్టాత్మక ఉప్పల్ స్కైవాక్‌కు ఇప్పుడు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో గండం ఎదురైంది. కారిడార్‌కు సంబంధించిన భారీ పిల్లర్ల నిర్మాణానికి స్కైవాక్ అడ్డుగా మారడంతో.. దాన్ని ఒక వైపు తాత్కాలికంగా ముక్కలుగా తొలగించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (ఎవీణూ) అధికారులు సిద్ధమవుతున్నారు.

గతంలో ఉప్పల్ క్రాస్‌రోడ్డు దాటాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీనికి పరిష్కారంగా 2020లో రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో 660 మీటర్ల పొడవు, 34 మీటర్ల వెడల్పుతో 8 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, 6 మెట్ల మార్గాలతో ఈ స్కైవాక్ పనులు ప్రారంభించి 2023లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. భూమి నుంచి 6 మీటర్ల క్లియరెన్స్ ఉండే ఈ స్కైవాక్ పాదచారులకు ఎంతో సౌకర్యంగా మారింది. అయితే, తాజాగా ఉప్పల్ రింగురోడ్డు మీదుగా నిర్మిస్తున్న కొత్త ఎలివేటెడ్ కారిడార్ ఈ స్కైవాక్‌తో పాటు దానిపై నుంచి వెళ్లే మెట్రో రైలు లైన్‌ను కూడా దాటాల్సి ఉంది. అందువల్ల ఈ కారిడార్‌ను భూమి నుంచి గరిష్ఠంగా 23 మీటర్ల ఎత్తులో నిర్మించేలా డిజైన్ చేశారు.

ఇంత భారీ ఎత్తున ఉండే ఫ్లై ఓవర్‌ను మోయడానికి ఉప్పల్ జంక్షన్ వద్ద భారీ పిల్లర్లను నిర్మించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వరంగల్ జాతీయ రహదారి వైపు వెళ్లే స్కైవాక్ పిల్లర్ నంబర్ 23 ఏ నుంచి 24 వరకు ఉన్న దాదాపు 17 మీటర్ల మేర స్కైవాక్ భాగాన్ని తక్షణమే తొలగించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ తొలగింపు పనులు, పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక మళ్లీ స్కైవాక్‌ను యథావిధిగా అమర్చడానికి అయ్యే అంచనా వ్యయాన్ని లెక్కించే బాధ్యతను ఒక ప్రైవేట్ కన్సల్టెన్సీకి అప్పగించారు. దీనిపై క్షేత్రస్థాయి అధ్యయనం కోసం కన్సల్టెన్సీ ప్రతినిధులు మంగళవారం ఉప్పల్‌కు రానున్నారు.

ఈ నిర్మాణాల కారణంగా రానున్న కొన్ని నెలల పాటు వరంగల్ రహదారి వైపు ఉన్న స్కైవాక్ మార్గాన్ని పూర్తిగా మూసివేయనున్నారు. దీనివల్ల కాలినడకన ప్రయాణించే వారికి కొన్ని ఇబ్బందులు తప్పవు. కాగా.. ఈ తాత్కాలిక తొలగింపు, పునర్నిర్మాణ ప్రక్రియకు అయ్యే పూర్తి ఖర్చును మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భరించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



# రోడ్డంతా వాటిదే రాజ్యం..!

- నడిరోడ్డుపైనే పశువుల మకాం...
- ప్రధాన రహదారులపై స్వైర విహారం చేస్తున్న ఆవుల గుంపులు
- రాత్రివేళ ప్రమాదాలకు కారణమవుతున్న మూగజీవాలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. వాహనదారుల్లో ఆందోళన
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖలు
- ప్రాణనష్టం జరగకముందే చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

*రాత్రి వేళల్లో రహదారులపై పశువులు గుంపులుగా నిలబడటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ల కారణంగా పశువులు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.*

**పీపుల్స్‌డైరీ-గణపురం :** గణపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు రోజురోజుకూ పశువుల స్వైర విహారానికి కేంద్రాలుగా మారుతున్నాయి. రహదారుల మధ్యలోనే గుంపులుగా మకాం వేస్తున్న ఆవులు, దూడలు, ఎద్దులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి వేళల వరకు పశువులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి చేరి గంటల తరబడి అక్కడే ఉండిపోతుండటంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో వేగంగా వస్తున్న వాహనాల ముందు ఒక్కసారిగా పశువులు ప్రత్యక్షమవుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం రోజురోజుకూ పెరుగుతోంది.

మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రుల పరిసరాలు, జనసంచారం ఎక్కువగా ఉండే రహదారులపై పశువుల సంచారం అధికంగా కనిపిస్తోంది. రోడ్ల మధ్యలోనే గుంపులుగా కూర్చోవడం, నెమ్మదిగా సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాహనాలు నిలిచిపోవడం, ప్రయాణికులు ఇబ్బందులు పడడం నిత్యకృత్యంగా మారింది. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పశువులను తప్పించుకునే క్రమంలో వాహనాలపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో పశువులు ఒక్కసారిగా రోడ్డును దాటడం వల్ల డ్రైవర్లు అకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. దీంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలు ఢీకొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చిన్నపాటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ పెద్ద ప్రమాదం జరగకపోవడం అదృష్టమేనని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

పగటి సమయంలో యజమానులు పశువులను మేత పేరుతో రోడ్లపై వదిలేయడం, రాత్రి సమయంలో వాటి గురించి పట్టించుకోకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త కుప్పలు, కూరగాయల వ్యర్థాలు, హోటళ్ల వద్ద పడేసే ఆహార అవశేషాల కోసం పశువులు పట్టణంలోని ప్రధాన రహదారులపైకి చేరుతున్నాయని చెబుతున్నారు. ఒకసారి రహదారిపైకి వచ్చిన తర్వాత అవి గంటల తరబడి అక్కడే సంచరిస్తూ ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారుతున్నాయి.

ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పశువుల కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరిగిన ఘటనలు నమోదయ్యాయి. అయినప్పటికీ గణపురం మండల కేంద్రంలో మాత్రం పరిస్థితి యథాతథంగానే కొనసాగుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖలు, స్థానిక సంస్థలు, పంచాయతీ అధికారులు సమస్యను గుర్తించినప్పటికీ సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పశువుల యజమానులపై జరిమానాలు విధించడం, నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రహదారులపై సంచరించే పశువులను నియంత్రించడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పశువుల కోసం ప్రత్యేక గోశాలలు ఏర్పాటు చేసి వాటిని అక్కడికి తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, వ్యాపారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు బలికాకముందే సంబంధిత శాఖలు మేల్కొని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.





పీపుల్స్ డైరీ
కరీంనగర్
బుధవారం, 17 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 104


# డిజిటల్ లావాదేవీలను సద్వినియోగం చేసుకోవాలి!

**పీఓఎస్ యంత్రాల ద్వారా సులభతరంగా స్త్రీ నిధి రుణాల చెల్లింపులు - వివిధ సమాఖ్యలకు పీఓఎస్ యంత్రాలు అందచేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**






**మట్టెవాడ, జూన్ 16 (పీపుల్స్ డైరీ):** పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలను సద్వినియోగం చేసుకుని డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించుకోవాలని బల్దియా ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమాఖ్యలకు పీఓఎస్ యంత్రాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించేందుకు స్త్రీ నిధి ఆధ్వర్యం లో సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాలకు ఉచితంగా పీఓఎస్ యంత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రాల ద్వారా సభ్యులు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్త్రీ నిధి రుణాల చెల్లింపు లు చేయడంతో పాటు వెంటనే రసీదు పొందవచ్చని చెప్పారు. పీఓఎస్ యంత్రాల ద్వారా స్త్రీ నిధి రుణాల ను సులభతరంగా, పారదర్శకంగా చెల్లించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రస్తుతం హనుమకొండ పరిధిలో 56, వరంగల్ పరిధిలో 45 పీఓఎస్ యంత్రాలను పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో అన్ని సమాఖ్యలకు ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. పీఓఎస్ యంత్రాల వినియోగంపై సభ్యులు సాంకేతిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంక్ లింకేజీలు, రుణాల వసూళ్లు, నాన్ - పర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పీఏ) తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు చొరవ చూపాలని కలెక్టర్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్త్రీ నిధి రుణాల అమలులో నగరం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈసారి జాతీయ స్థాయిలో కూడా అవార్డు సాధించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణాల ప్రయోజనాలను కేవలం రెగ్యులర్ స్వయం సహాయక సంఘాలకే పరిమితం చేయకుండా ఇతర అర్హులైన గ్రూపులకు కూడా విస్తరించాలని, మరింత మంది మహిళలను ఆర్థిక సాధికారత దిశగా ముందుకు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆర్‌పీలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ సైదిరెడ్డి, మేనేజర్ కపిల్, టీఎంసీ రమేష్, అసిస్టెంట్ మేనేజర్లు వెంకట్, సుప్రియ, సతీష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రవీణ్, రజిత, శ్రీలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా డీసిల్టేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

**బల్దియా ప్రత్యేక అధికారి/ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



**మట్టెవాడ, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** వేగవంతంగా డీసిల్టేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని బల్దియా ప్రత్యేక అధికారి/ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హన్మకొండ పరిధిలోని జవహర్ కాలనీ, ప్రెసిడెంట్ స్కూల్, రాజాజీ నగర్, నయీమ్ నగర్ ప్రాంతాలలోని నాలాలను ప్రత్యేకాధికారి నేరుగా పరిశీలించి సమర్థవంతంగా పూర్తి చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసిల్టేషన్ పూర్తి చేసుకున్న నాలాల వివరాలను అధికారులను అడిగి తెలుసు కున్న కలెక్టర్ మాట్లాడుతూ కొద్ది స్థాయిలో డీసిల్టేషన్ పెండింగ్ లో ఉన్న ప్రాంతాల్లో కూడా వెంటనే పూర్తి చేయించి, అవసరమున్న ప్రాంతాలలో లోతుగా డీసిల్టేషన్ చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



**ఆత్మకూర్, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పెద్దాపూర్ బాలికల పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అనిత మంగళవారం శాలువాలతో సన్మానించి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా రేమిడి మల్లారెడ్డి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కష్టపడి చదువుతే ఫలితం తప్పక ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మకూరు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మలా కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేజీబీవీలో టీచర్, నర్సింగ్ పోస్టులకు

## దరఖాస్తుల స్వీకరణ

**చిట్యాల, జూన్ 16(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మరియు జూనియర్ కళాశాలలో 6 నుండి10 తరగతి విద్యార్థులకు బోధించుటకు తెలుగు పోస్టు ఒకటి, ఇంటర్లో ఎంపీహెచ్డబ్ల్యూ విద్యార్థులకు బోధించుటకు నర్సింగ్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయని తాత్కాలిక పద్ధతిలో నియామకం జరుగుతుందని స్పెషల్ ఆఫీసర్ పి సుమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత గల మహిళా అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ పత్రాలతో కేజీబీవీ చిట్యాలలో 17 మరియు 18 తేదీలలో సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## ఏఐకేఎంఎస్ 14వ మహాసభలను జయప్రదం చేయండి!

**ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు**



**మట్టెవాడ, జూన్ 16 (పీపుల్స్ డైరీ):** ఈనెల 18న నర్సంపేట పట్టణంలో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 14వ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు కోరారు. మంగళవారం ఖిలావరంగల్ పడమర కోట తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ 18న జరుగు మహాసభకు సంఘం అధ్యక్షులు జక్కుల తిరుపతి అధ్యక్షత వహిస్తారని ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఐఎఫ్.టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటు ఉంటుందన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బండి వెంకటేశ్వర్లు, పుప్పాల రవీందర్, ఎండి.అక్బర్, బండి రవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో వ్యక్తి దారుణ హత్య



**కేసముద్రం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఇనుపరాడ్లతో ఓ వ్యక్తి తలపై మోది హతమార్చిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.ఉప్పరపల్లికి చెందిన కుండె నరేశ్ (36) అదే గ్రామానికి చెందిన కంకల కుమారస్వామి, కనకమ్మ దంపతుల కుమార్తె అనూషను వివాహం చేసుకున్నాడు. నరేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా అత్తగారింటి వద్ద రాత్రి నరేశ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఇనుపరాడ్లతో తలపై మోదడంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. సం ఘటన స్థలానికి ఎస్సై క్రాంతికిరణ్ చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, నరేశ్ హత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది.

## పెండింగ్‌లో దరఖాస్తులను పరిశీలించండి

**భూపాలపల్లి ఆర్డిఓ హరికృష్ణ**



**మొగుళ్ళపల్లి, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మండలంలో సాదా బైనామాకు సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్డిఓ పి హరికృష్ణ అన్నారు. భూపాలపల్లి ఆర్డీవో హరికృష్ణ మంగళవారం ముల్కలపల్లి గ్రామంలో పర్యటించి. సాధాబైనమా దరఖాస్తులపై మొగుళ్లపల్లి తహసిల్దార్ జాలి సునీత, రైతులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో హరికృష్ణ మాట్లాడుతూ. సాధాబైనమా దరఖాస్తుల పరిశీలన, నివేదికల సమర్పణను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులకు సాధాబైనమా ప్రక్రియ, అర్హత ప్రమాణాలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తుల పరిశీలన విధానం, ప్రభుత్వ మార్గదర్శకాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. రైతులు సరైన పత్రాలతో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సహకరించాలని, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో పారదర్శకత, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, జాలి సునీత, ఆర్ఐ శివరామకృష్ణ, ముల్కలపల్లి సర్పంచ్. గాదం శ్రీవాణి రమేష్, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని గేద మృతి



**గోవిందరావుపేట, జూన్ 16(పీపుల్స్ డైరీ) :** మండల పరిధి పసర-గోవిందరావుపేట 163వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని 70 వేల విలువ చేసే పాడి గేద మృతి చెందింది. వేసవి కాలం పంట పొలాలు మొత్తం కోతల కోయడంతో గేదెల యాజమానులు గేదలను వదిలిపెట్టడంతో పంట పొలాల్లో మేతకు వెళ్లి తిరిగి ఇంటికి జాతీయ రహదారిపై వస్తున్న క్రమంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం జాతీయ రహదారిపై వెళ్తున్న గేదెను ఢీకొని సుమారు రెండు పర్లాంగుల వరకు రోడ్డుపై దూసుకెళ్ళ గా రోడ్డుపైన కాసరు పేగులు చిట్లిపోయి గుర్తు తెలియని వాహనం రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొనడంతో గేదెను ఢీకొన్న వాహనం ఆగిపోయింది, రోడ్డు పక్కన చెట్టు లేనట్లయితే గేదెను ఢీకొన్న వాహనం పంట పొలాల్లో పడి ప్రాణాష్టం జరిగేదని స్థానికులు చెబుతున్నారు, ఏదేమైనాప్పటికీ ఇసుక లారీలు రాత్రి వేళలో వేగంగా వెళ్లడం వలన జాతీయ రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారులను కూడా ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు,

## బడి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి : సిపిఐ



**కేసముద్రం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండాలో అసంపూర్తిగా ఉన్న బడి నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండాలో అసంపూర్తిగా ఉన్న బడి భవన నిర్మాణాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అయినా నేటికీ విద్యార్థులు చెట్ల కింద, రేకుల షెడ్డు ల కింద విద్యను అభ్యసించడం బాధాకరమని అన్నారు. బ్రహ్మంగారి తండాలో 2001 సంవత్సరం నుండి సొంత భవనం లేక విద్యార్థులు అద్దె భవనంలో, మధ్యాహ్న భోజన వంట మనిషి ఇంటిలోని రేకుల షెడ్డు కింద చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో మన ఊరు- మన బడి పథకం కింద పాఠశాల భవనం మంజూరైనప్పటికీ నేటికీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్యను అందించాలని, బడిబాట కార్యక్రమం ద్వారా అడ్మిషన్లు పెంచాలని ప్రభుత్వం చెప్పుతుందని కానీ తరగతి గదులు లేక, కనీస సౌకర్యాలు లేకపోవడంతో అడ్మిషన్లు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూల్ పోస్టుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం : ఎంఈఓ రఘుపతి



**చిట్యాల, జూన్ 16 (పీపుల్స్ డైరీ):** మండలంలో కొత్తగా మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో బోధనను నిర్వహించుటకు ఖాళీగా ఉన్న 4-ఇన్స్ ట్రక్టర్ 4-ఆయా పోస్టులకు స్థానిక అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరంనకు 10 నెలల తాత్కాలిక ప్రాతిపాదికన ఎంపీపీఎస్ చిట్యాల ఎంపీపీఎస్ జూకల్ ఎంపీపీఎస్ చల్లగరిగ ఎంపీపీఎస్ భీష్మనగర్ పాఠశాలలో ఇన్స్ ట్రక్టర్ ఆయా పోస్టులకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల19 వ తారీకు సాయంత్రం 4 గంటల వరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు ఫారం తో పాటు స్థానికత, విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ పాస్ ఫోటో ను జతపరచి అందజేయాలని పేర్కొన్నారు. ఇన్స్ ట్రక్టర్ కు నెలకు రూ.8 వేలు గౌరవ వేతనం అందిస్తారు. ఈ పోస్టుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలని ప్రీ ప్రైమరీ డిప్లమా లేదా ప్రీ ప్రైమరీ ట్రైనింగ్ చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని ఆయా పోస్టు కు నెలకు రూ.6 వేలు గౌరవవేతనం అందిస్తారని ఈ పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణులైన మార్కుల జాబితా పత్రమును జత చేయాలన్నారు. పై పోస్టులకు 18 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులని స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉండనున్నట్లు ఎంఈఓ రఘుపతి తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన రెడ్యా నాయక్

**నర్సింహులపేట, జూన్ 16 (పీపుల్స్ డైరీ):** మండలంలోని పెద్దనాగారం గ్రామపంచాయతీ పరిధి హాజతండాకు చెందిన భూక్య రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందిన అనంతరం స్వగృహా నికి చేరుకున్న సందర్భంగా మాజీ మంత్రి రెడ్యా నాయక్ మంగళవారం ఆయనను పరామర్శించారు. అలాగే జగ్య తండాకు చెందిన భూక్య రవీందర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం లో గాయపడగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను బాధితుల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు అల్లిపురపు రవి, చలమల్ల సోమయ్య, భూక్య రవి, నునావత్ శాంతమ్మ తదితరులు ఉన్నారు.




## నైట్ హాల్ట్ బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోండి




**మొగుళ్లపల్లి జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మండల ప్రజలు, నైట్ హాల్ట్ బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలని మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ అన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ. ఎన్నో సంవత్సరాల నుండి మొగులపల్లి గ్రామానికి నైట్ హాల్ట్ బస్సు లేక పోవడంతో. ప్రయాణికులు రాత్రివేళలో గమ్యస్థానాలను చేరేందుకు నానా ఇబ్బందులు పడేవారని. నైట్ హాల్ట్ బస్ రావాలనేది మొగుళ్లపల్లి ప్రజల ఎన్నో సంవత్సరాల కల అని, ఆ కలను నెరవేర్చి సమస్యను పరిష్కరించేందుకు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో టీఎస్ ఆర్టిసి పరకాల డిపో మేనేజర్ రాంప్రసాద్ కు మే 15 న వినతి పత్రం అందజేయగా డిపో మేనేజర్ రాంప్రసాద్ సానుకూలంగా స్పందించి. నైట్ హాల్ట్ బస్సును జూన్ 15 సోమవారం రాత్రి 8:30కి పరకాల బస్ స్టాండ్ నుండి బస్ పునరుద్దరించినట్లు మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్‌కు మంగళవారం డిపో మేనేజర్ సమాచారం అందించారని, నేటి నుండి మండల ప్రజలు, వాణిజ్య, వ్యాపార, విద్య ఉద్యోగ ఉపాధి కోసం వెల్లి స్వగ్రామానికి తిరిగి వచ్చేవారు, పరకాల బస్టాండ్ నుండి 8:30 ని,, బయలుదేరిన బస్సు, 9 గంటలకు మొగుళ్ళపల్లికి చేరుకుంటుంది. మరుసటి రోజు జూన్ 16 ఉదయం 4:30 కు మొగుళ్లపల్లి నుండి బయలుదేరి జమ్మికుంటకు 5:15 చేరుకుంటుందని ప్రతి రోజు ఇదే సమయానికి నైట్ హాల్ట్ బస్ వస్తుందని సర్పంచ్ మండల ప్రజలకు వివరించారు. నైట్ హాల్టు బస్సును పున ప్రారంభించినందుకు సర్పంచ్ చాట్ల విజయ రవీందర్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

## ప్రశ్నించే గొంతుక పీపుల్స్ డైరీపై అక్రమ కేసులు సరికాదు : మల్లయ్య




**చిట్యాల, జూన్ 16(పీపుల్స్ డైరీ) :** ప్రజల కోసం ప్రశ్నించే గొంతుక పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రిక పై విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛకు ప్రజాస్వామ్యానికి భారత రాజ్యాంగానికి విరుద్ధమని అది సరికాదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాస్తున్న పీపుల్స్ డైరీ పై ఆర్టిఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్ పరువు నష్టం దావా విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. ఈ విషయంలో కోర్టులు జోక్యం చేసుకొని అక్రమ కేసులను కొట్టివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతుక పీపుల్స్ డైరీ పై అక్రమంగా కేసులు నమోదు చేయించడం బావ ప్రకటన స్వేచ్ఛను కాలరాయడమే అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభమైన మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరైనది కాదు అన్నారు. మీడియా స్వేచ్ఛను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్న సంస్థలు వ్యక్తులపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.



## జేఈఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

**గణపురం, జున్ 16 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రానికి చెందిన రాచర్ల రాధిక రామకృష్ణ కుమారుడు రాచర్ల అక్షయ సందేశ్,ఇటీవల విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 646వ ర్యాంక్ సాధించగా మంగళవారం నియర్ అండ్ డియర్ గ్రూప్ స్నేహితుల కుటుంబ సభ్యులు సన్మానించారు, ఓ బిసి కోటాలో ఖరాగ్ పూర్ ఐఐటీలో సీటు సాధించగా శాలువాలతో సన్మానించారు. ఐఐటీ లో ఉన్నత చదువు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో నియర్ అండ్ డియర్ ప్రెసిడెంట్ కూతురు రమణ, స్వాతి, చాగర్తి లక్ష్మీనారాయణ, అనూష, దూలం కుమార్, శ్రీదేవి, నడిగోటి రాములు, సౌజన్య, కర్రు రఘు, సరిత, ఓడపల్లి భాస్కర్, లత, కడారి మహేందర్, నాగరాణి, రాజేందర్, శ్యామల, శ్రీధర్, రోజా, మైనాల వెంకటేశ్వర్లు, వనమాల, నగేష్, భాగ్యలక్ష్మి, స్వామి, రమ, దౌడు రమేష్, సుమలత, ధనంజయ, లలిత, అజ్మత్, జరీనా, భాస్కర్ సంధ్య, సంతోష్ శిరీష తదితరులు సన్మానించారు.

# పస్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

## రికార్డులు పరిశీలించి పలు సూచనలు - ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

**ములుగు, జున్ 16 (పీపుల్స్ డైరీ) :** జిల్లా పోలీసు వ్యవస్థ పనితీరును మరింత మెరుగుపర్చే దిశగా ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ మంగళవారం పస్ర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకం గా వ్యవహరించాలని రిసెప్షన్ సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండా లని ఎస్పీ సూచించారు. వరదలు, ఇతర ప్రకృతి వైపరీ త్యాలు





సంభవించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు అండగా నిలిచి తక్షణ సహాయక చర్యలు చేపట్టే లా సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ, కేసులు, ఇతర నమోదులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సేవల నాణ్యతపై పలు అంశాలను అధికారులతో చర్చించి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, పస్ర సీఐ దయాకర్, ఎస్ ఐ తాజుద్దీన్ లు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ షాపులపై సిసిఎస్ పోలీసుల ఆకస్మిక తనిఖీ



**స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల నిల్వల పరిశీలన**

**గడువు ముగిసిన, నకిలీ విత్తనాల విక్రయాలపై హెచ్చరిక**

**ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**గణపురం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** రైతులను మోసగించే నకిలీ, నాసిరకం విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు గణపురం మండలంలోని ఫర్టిలైజర్ షాపులపై మంగళవారం సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల రికార్డులు, విత్తనాల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు, నకిలీ విత్తనాలు, విడి విత్తనాల విక్రయాలు చేయరాదని దుకాణ యజమానులకు స్పష్టం చేశారు. అలాగే రైతులకు విక్రయించే ప్రతి విత్తన ప్యాకెట్‌కు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయదారులను మోసగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయాలు నిర్వహించినా, నకిలీ లేదా అనుమతి లేని విత్తనాలను విక్రయించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలు లేదా అక్రమ నిల్వలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాల ని సూచించారు. ఈ తనిఖీలు రైతుల్లో నమ్మకం పెంచడంతో పాటు నకిలీ విత్తనాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ బడిలో చేరితే ఇంటి పన్ను మాఫీ...

**బడిబాటలో బుద్ధారం గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం**

**10వ తరగతి వరకు ఇంటి పన్ను రద్దు చేస్తామని సర్పంచ్ హామీ**



**గణపురం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు బుద్ధారం గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం తీసుకుంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్, ఉప సర్పంచ్ మారబోయిన ఐలయ్య ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల లో పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ప్రత్యేక ప్రోత్సాహకంగా విద్యార్థి పదో తరగతి పూర్తి చేసే వరకు ఇంటి పన్నును మాఫీ చేస్తామని గ్రామ సర్పంచ్ ప్రకటించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసిన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతోందని, అర్హత కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, రాగిజావ, మధ్యాహ్న భోజనం అందిస్తోందని గుర్తు చేశారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి 23 రకాల వస్తువులతో కూడిన విద్యా కిట్‌ను ప్రభుత్వం అందజేస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభివృద్ధికి సహకరించాల ని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మమత, శోభ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి

### సర్పంచ్ లక్ష్మి అంతయ్య



**చిట్యాల, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కోడెపాక రఘుపతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ 4 వ వార్డ్ సభ్యులు తౌటం నవీన్ ఉపాధ్యాయులు బుర్ర సదయ్య శ్రీనివాస్ కల్పన విజయలక్ష్మి రాజమౌళి రాంనారాయణ శంకర్,ఉస్మాన్ పాఠశాల సిబ్బంది ప్రజాప్రతినిధులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జేఈఈలో ఆల్ ఇండియా 646వ ర్యాంక్

### అంబేద్కర్ సంఘం అధ్వర్యంలో అక్షయ్ సందేశ్‌కు ఘన సన్మానం



**గణపురం, జున్ 16 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రానికి చెందిన రాచర్ల అక్షయ్ సందేశ్ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ చాటుతూ ఆల్ ఇండియా 646వ ర్యాంక్ సాధించి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అతడిని ఘనంగా సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో అక్షయ్ సందేశ్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు, ముఖ్యంగా ఆర్టికల్ 15(4), 16(4) ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రత్యేక అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. కష్టపడి చదివే విద్యార్థులకు రిజర్వేషన్లు మరింత ప్రోత్సాహంగా నిలుస్తున్నాయని అన్నారు. అక్షయ్ సందేశ్ విజయం వెనుక అతని తల్లిదండ్రులు రాధిక, రామకృష్ణల కృషి, ప్రోత్సాహం ఎంతో గొప్పదని కొనియాడారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన అక్షయ్ సందేశ్ యువతకు ఆదర్శంగా నిలుస్తాడని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్క సంపత్, ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ, చిలువేరు ఉదయాకర్, మాదాసు లక్ష్మణ్, మైనార్టీ మండల నాయకులు ఎండి సైదులు, రజక సంఘం జిల్లా యూత్ నాయకులు పసునూటి శంకర్, ఆలూరు మొగిలి, మూల రఘు, ఎన్నిండ్ల శ్రీకాంత్, ఎస్.కె బహదూర్ ఖాన్, చిలువేరు శంకర్, అక్కపాక సుమన్, సామెర్ల సంపత్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

## ధర్మరావుపేటలో బేటీ బచావో - బేటీ పడావో అవగాహన, అక్షరాభ్యాసం

**గణపురం, జున్ 16 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి సూచనలతో బేటీ బచావో--బేటీ పడావో అవగాహన, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సూపర్వైజర్ శ్రీమతి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పూజారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్య ప్రతి బిడ్డకు ప్రాథమిక హక్కు అని, బాలురు--బాలికలు అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. బాలికల విద్య కుటుంబాభివృద్ధికి, సమాజ పురోగతికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇన్‌చార్జి మిషన్ కోఆర్డినేటర్ క్రిష్ణ మాట్లాడుతూ మహిళల సాధికారత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి, మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అలాగే మహిళలు, బాలికల కోసం అందుబాటులో ఉన్న 181 మహిళా



హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు, 14567 సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. జెండర్ స్పెషలిస్ట్ అనూష కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా బేటీ బచావో--బేటీ పడావో పథకం బాలికల విద్య, భద్రత, ఆర్థిక భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడు తోందన్నారు. కుటుంబాల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని పేర్కొన్నారు. అనంతరం సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ... "అమ్మ మాట -- అంగన్వాడి బాట" కార్యక్రమం ద్వారా మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహార లోపం లేని ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది క్రిష్ణ, అనూష, సురేష్ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పట్టాలిచ్చిన సీలింగ్ భూములకు హద్దులు చూపించాలి

## భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందులో ప్రదర్శన : తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మామిడిగుండాల ప్రాంతంలో సీలింగ్ భూములను భూస్వాముల ఆక్రమణను నిలుపుదల చేయాలని, పట్టాలిచ్చిన సీలింగ్ భూములకు హద్దులు చూపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇల్లెందులో మామిడి గుండాల భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇల్లెందు కొత్తబస్టాండ్ నుంచి వందలాది మంది ఆదివాసి, గిరిజనులు ప్రదర్శనగా బయలుదేరి గోవింద్ సెంటర్ మీదుగా తాసిల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు,భూపోరాట కమిటీ కన్వీనర్ ఎట్టి వీరభద్రం మాట్లాడుతూ ఇల్లందు మండలం మామిడి గుండాల ప్రాంతంలో దొరల ఆధీనంలో ఉన్నటువంటి 4850 ఎకరాల భూమిలో 2,800 ఎకరాల భూమిని సీలింగ్ కింద తీశారని అన్నారు.ప్రతి ఆదివాసి గిరిజన కుటుంబానికి 5 ఎకరాల చొప్పున 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పట్టాలిచ్చిందని అన్నారు. అడవిగా ఉన్న భూమిని మామిడి గుండాల, రాజ్యాతండా, చాపల వారిగుంపు, బోటి గుంపు, మేడికుంట సువర్ణపురం, ధనియాలపాడు, బాలాజీ తండా, సేవ్యా తండా గ్రామాల ప్రజలు నరుక్కొని



సేద్యం చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. ఈ భూములను వారం రోజుల నుండి నెమరగొమ్ముల శ్రీనుబాబు, ఉమా మహేశ్వరరావు, శ్యాంసుందర్ రావు అనే భూస్వాములు భూములలో ట్రెంచులు కొట్టి చట్టవిరుద్ధంగా భూములను ఆక్రమిస్తున్నారని విమర్శించారు. అధికారులు జోక్యం చేసుకొని అక్రమ పద్ధతిలో చట్టవిరుద్ధంగా ఆదివాసీల భూముల ఆక్రమణకు పూనుకున్న భూస్వాములపై కేసులు నమోదు చేయాలని,సీలింగ్ భూములకు హద్దులు చూపించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.లేని ఎడల జరగబోయే పరిణామాలకు ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం తాసిల్దార్ కాసిం కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు. సిపిఐ(ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మామిడిగుండాల సర్పంచ్ ఎట్టి రమణ, మాజీ సర్పంచ్ కుంజ కృష్ణ, భూపోరాట కమిటీ, అఖిలపక్షాల నాయకులు ముక్తి సీతారాములు,ఈసం భద్రయ్య, జబ్బా అంజయ్య, బానోత్ వెంకన్న, ఆంగోత్ ఆంజనేయులు, నూనావత్ రాందాస్, చింత భాస్కర్, మోకాళ్ళ పొట్టయ్య,సూర్ణపాక రాంబాబు, ఈసం బొజ్జ య్య,తోలేం నరేష్,సూర్ణపాక ప్రభాకర్, సూర్ణపాక మోహన్ రావు, సూర్ణపాక జంపయ్య,దారావత్ రవి, గుగులోత్ బాలు, గుగులోత్ ధర్మ, కొనుసోత్ లాలుప్రసా ద్, మమత, యదల్లపల్లి సత్యం, పొడుగు నరసింహారావు, సూర్ణపాక నాగేశ్వరరావు, కొక్కు సారంగ పాణి, నరాటి వెంకటేశ్వర్లు, తోడేటి నాగేశ్వరరావు, ఎట్టి నరసింహారావు, ఎట్టి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## వైరా ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసి, నూతనంగా నిర్మాణంలో ఉన్న ఏరియా హాస్పిటల్ పురోగతి పనులను పరిశీలించిన కలెక్టర్





**ఖమ్మం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం వైరా నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వైరా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారీ నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసరపు సి-సెక్షన్ ఆపరేషన్ చేయవద్దని అన్నారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డా.రాజశేఖర్ గౌడ్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన



**పినపాక, జూన్ 16,(పీపుల్స్ డైరీ) :** మండలపరిదిలోని గోపాలరావుపేట గ్రామంలో దాదాపు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణపనులను ఈడబ్ల్యూఐడీ సి ఏఈ ఎం. సత్య శ్రీనివాస్ మంగళవారం తనికి చేశారు. దాదాపు 30 ఎకరాలలో జరుగుతున్న పీసీసీ పనులను పరిశీలించి సంతృప్తి చెందారు.ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ పనులలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారు ఎస్ఆర్ఆర్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు తెలిపారు.

# ఎల్లాపురం గ్రామస్థులకు ఇందిరమ్మ ఇళ్ళు, ఇంటి స్థలం ఇచ్చి తీరుతా : ఎమ్మెల్యే పాయం హామీ



**పినపాక, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని పోట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లా పురం గ్రామస్థులు తమ సమస్యలు పై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను కలిశారు. గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా మారిన పెద్ద వాగు పక్కన ఉంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, ఏ క్షణంలో ఏ ప్రమాదం వస్తుందో తెలియక ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని మొర పెట్టుకున్నారు. వారి సమస్యలు, పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని ఎల్లాపురం గ్రామస్థులను అక్కడి నుంచి ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతంలో ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయించి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆనందం, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు గొగ్గల రామకృష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినంధించిన సీపీ



**ఖమ్మం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** చిన్నారులపై లైంగిక వేధింపులు పోక్సో కేసుల్లో, గంజాయి వంటి తీవ్రమైన ఎన్డిపిఎస్ కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడం, ప్రాసిక్యూషన్, పోలీసుల సమన్వ యంతో నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ... నేరస్థులకు జీవిత ఖైదు, 20 ఏళ్ల జైలు శిక్ష మొదలు అనేక కఠిన కారాగారా శిక్షలు పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాదిలో ఇప్పటికే ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అయిన ఐదు పోక్సో కేసుల్లో ఖమ్మం అర్బన్ కేసులో నిందుతుడికి జీవిత ఖైదు, రఘునాథ పాలెం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష, ఖమ్మం రూరల్ రెండు వేర్వేరు కేసులో ఏడు, ఐదు సంవత్సరాల జైలు,రఘునాథపాలెం కేసులో మూడు సంవత్స రాల ఆరు నెలల శిక్ష పడ్డాయి. అదేవిదంగా గంజాయి వంటి 10 ఎన్డిపిఎస్ కేసుల్లో ఆరు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, మరో రెండు కేసుల్లో 10 ఏళ్ల జైలు, ఒక కేసులో ఏడు ఏళ్ల జైలు, రెండు కేసుల్లో ఏడాది వరకు జైలు శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ అభినందించారు.

# సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలి



**ఏన్కూరు జూన్ 16 పీపుల్స్ డైరీ) :** సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఏన్కూరు మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు సమస్యలు పరిష్కారం కోరుతూ వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ యూరియా సరఫరా లో రాష్ట్ర ప్రభుత్వం యాప్ ప్రవేశపెట్టడం వల్ల సాగు భూమి కలిగి ఉండి పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడం వల్ల యూరియా పొందలేని పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలతో సంబంధం లేకుండా భూమి కలిగిన ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలి అని అన్నారు. ఎరువులు, పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో రైతుల పైన భారం ఎక్కువ పడింది అన్నారు. రబీ సీజన్లో రైతు భరోసా రెండు ఎకరాల వరకు రైతు బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ప్రభుత్వం మిగితా డబ్బులు విడుదల చేయడం లేదని రబీ పెండింగ్ నిధులు తోపాటు ఖరీఫ్ సీజన్ రైతు భరోసా నిధులు విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు.రబీ సీజన్ లో ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న డబ్బులు రైతులకు అందించాలి అని అన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం బాధ్యత వహించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా లక్ష్మా,ఏన్కూరు మండల అధ్యక్షులు నండూరి శ్రీనివాసరావు, కార్యదర్శి గుండా సత్యనారాయణ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు దొంతి బోయిన నాగేశ్వరరావు, వెల్పుల రాములు, ఇటికాల లెనిన్, గంగరాజు,మల్లయ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# అల్లేరుగూడెం సార్లమ్మ గుడి కూల్చివేత ఘటన పట్ల ఖండన



**కరకగూడెం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని అల్లేరుగూడెం గ్రామంలో ఫారెస్ట్ అధికారులు సార్లమ్మ గుడి నిర్మాణాన్ని కూల్చివేసిన ఘటనపై తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి పోలెబోయిన వెంకటనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి గుడి ప్రాంతాన్ని సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల ఆచారాలు, సంప్రదాయాలు, ఆరాధనా స్థలాలకు ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. పూర్వీకుల కాలం నుండి కొనసాగుతున్న సార్లమ్మ దేవత స్థలాన్ని గ్రామ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం అత్యంత బాధాకరమైన, ఖండనీయమైన చర్య అని పేర్కొన్నారు. ఆదివాసీల విశ్వాసాలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించిన సంబంధిత అధికారుల తీరును తుడుందెబ్బ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఐదవ షెడ్యూల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఆదివాసీ హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బాధిత మహిళలకు అండగా 'భరోసా' కేంద్రాలు : అడిషనల్ డీసీపీ రామానుజం



**ఖమ్మం, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** చిన్నారులపై హింసను అరికట్టడానికి, బాధిత మహిళలకు సమగ్ర సేవలను అందించడానికి 'భరోసా' కేంద్రాలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ... అండగా నిలుస్తున్నాయని అడిషనల్ డీసీపీ రామానుజం అన్నారు. హింస, లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, చిన్నారులకు భరోసా కేంద్రాల ద్వారా అందించే సహాయాన్ని, పునరావాస సేవలను బలోపేతం చేయడం కోసం వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయం కాన్ఫిరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు మార్గదర్శకాలు అడిషనల్ డీసీపీ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో దగా పడ్డ మహిళలకు అండగా నిలవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాల ద్వారా పోలీస్, వైద్య, న్యాయ, మానసిక కౌన్సెలింగ్ సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో వేధింపులకు గురైన బాధితులకు మరల ఇటువంటి వాటి బారిన పడకుండా చూడడమే భరోసా సంస్థ యొక్క ముఖ్య లక్ష్యమన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస గురైన మహిళలు, పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందించడంలో భరోసా కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బాధితులకు చేయూతనిచ్చే ఈ సేవల సమర్థవంతమైన నిర్వహణకు గాను పోలీసు, రెవిన్యూ, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ శాఖల తదితర అధికారులందరూ ఒకే ప్రాంగణంలో ఉండి బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తారన్నారన్నారు. పోలీస్ స్టేషన్, కోర్టుల వాతావరణానికి దూరంగా, బాధితులకు ఎలాంటి భయం లేకుండా సురక్షితమైన, గోప్యమైన వాతావరణంలో సాయం అందేలా చూస్తారన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు నిపుణులైన సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని నింపుతారన్నారని తెలిపారు. సమావేశంలో ఐసీపీఎస్ అధికారులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు, సిడబ్ల్యుసిడజేజేబు సభ్యులు, సభ్యులు, డిఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ఈ ఆర్పి ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కౌన్సిలర్లు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం: ఎస్సై



**నర్సింహులపేట, జూన్ 16 (పీపుల్స్ డైరీ):** గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని నర్సింహులపేట ఎస్సై బానోతు వెంకన్న కోరారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో సోమవారం నర్సింహులపేట పోలీసుల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆటో స్టాండ్, పెట్రోల్ బంక్, టీ దుకాణాలు, ఎస్‌బీఐ బ్యాంకు, ఏటీఎం కేంద్రం, మీ సేవా కేంద్రం, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, మోడల్ స్కూల్, ఎమ్మార్వో కార్యాలయం, ఇతర ప్రజా రద్దీ ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఎస్సై వెంకన్నమాట్లాడుతూ.. గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# తిమ్మారావుపేటను మండల కేంద్రంగా ప్రకటించాలి

## ఎమ్మెల్యేకు గ్రామస్థుల వినతి

**ఏన్కూరు, జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలానికి చెందిన తిమ్మారావుపేట గ్రామాన్ని తక్షణమే మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మంగళవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు

### అభివృద్ధికి దూరంగా 'తిమ్మారావుపేట'

ఎన్నో ఏళ్లుగా సరైన అభివృద్ధికి నోచుకోక తిమ్మారావుపేట గ్రామం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని విద్యార్థులు, రైతులు, కూలీలు తమ రోజువారీ పనుల నిమిత్తం, చదువుల కోసం, ప్రతి చిన్న అవసరానికి మైళ్ల దూరంలో ఉన్న ఏనుకూరు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, డబ్బు వృధా కావడమే కాకుండా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రైతులు తమ పంటల అవసరాల కోసం, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.



### జలగం వెంగళరావు కాలం నాటి ప్రతిపాదన..

తిమ్మారావుపేటను మండల కేంద్రంగా చేయాలనే డిమాండ్ నిన్న మొన్నటిది కాదని, ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ జలగం వెంగళరావు గారి కాలంలోనే దీనికి సంబంధించిన ప్రతిపాదనలు జరిగాయని గ్రామ పెద్దలు గుర్తు చేస్తున్నారు. అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల అప్పట్లో ఆ ప్రతిపాదన రద్దు కావడం, అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ గ్రామం ఎలాంటి ప్రగతికి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురైందని వారు ఆరోపిస్తున్నారు.

### మండల కేంద్రంగా ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి!

"మా గ్రామ ప్రజలందరిదీ ఒకే మాట. తిమ్మారావుపేటను మండల కేంద్రంగా ప్రకటిస్తే, చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలుపుకొని ఒక ఆదర్శవంతమైన మండలంగా తీర్చిదిద్దడానికి అన్ని అర్హతలు, భౌగోళిక అనుకూలతలు మా గ్రామానికి ఉన్నాయి" అని స్థానిక ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

### ప్రజాప్రతినిధులపైనే ఆశలు..

దాదాపు నాలుగు దశాబ్దాలుగా తిమ్మారావుపేట నివాసితులు కంటున్న ఈ కల స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే నెరవేరుతుందని గ్రామస్థులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమ చిరకాల కోరికను మన్నించాలని, తిమ్మారావుపేటను నూతన మండల కేంద్రంగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల కష్టాలను తీర్చాలని వారు మనస్ఫూర్తిగా అభ్యర్థిస్తున్నారు.

# నాణ్యమైన విద్యుత్‌ను అందించటమే ప్రభుత్వ లక్ష్యం

## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ఏన్కూరు జూన్ 16 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామానికి మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ తెలిపారు. మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామంలో టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఏడీఈ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్) భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. బురద రాఘవపురంలో రెండు కోట్ల పదహారు లక్షల వ్యయంతో నిర్మించనున్న సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వైరా నియోజకవర్గంలో తిమ్మారావుపేట కేంద్రంగా విద్యుత్ శాఖకు సంబంధించిన రెవెన్యూ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు సుమలత, రాణి, ఉప సర్పంచులు గొంది శ్రీనివాసరావు, బరపటి వెంకట నారాయణ, ఎస్ఈ శ్రీనివాసాచారి, ఎస్ఏఓ శ్రీధర్, డీఈలు బుద్ధపవర్, రమేష్, ఏఈ శ్రీధర్, ఏడీఈ యాసీన్, ఏఈ ఉమాకాంత్, వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com